

'సూర్య వాస్తవం' దినపత్రిక పాఠకులకు, మిత్రులకు.. వినాయక చవితి శుభాకాంక్షలు

Truth of News

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మహ్మద్ షఫీ అహ్మద్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

శనివారం, 07 సెప్టెంబర్ 2024 విజయవాడ | సంపుటి: 01 - సంచిక : 89 | పేజీలు : 08 వెల రూ.6.50

Published from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## వరద బాధితులందరినీ

# ఆదుకుందాం..!

### సహాయక చర్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కీలక ఆదేశాలు

**అమరావతి-సూర్య వాస్తవం**



ఏపీలో ఆరు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయిని.. ఈ నేపథ్యంలో ఏరియల్ సర్వే నిర్వహించి కొల్లేరు వరకూ వెళ్లి తర్వాత బుడమేరును అధ్యయనం చేశామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కృష్ణానదికి వస్తున్న వరదపై క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు వివరించారు. బుడమేరులో ఇంకా గండ్లు పూడ్చే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని అన్నారు. ముందు బుడమేరు బ్రీచ్ క్లీన్ చేయాలని.. అప్పుడే తాము చేసే పనికి సార్థకత అవుతుందని తెలిపారు. మూడు బ్రీచ్‌లలో రెండు క్లోజ్ అయ్యాయని.. ఇంకా ఒక్కటి ఉందని చెప్పారు. నిన్న 9వేల క్యూసెక్కుల నీరు వచ్చిందని.. ఇప్పుడు తగ్గి 3000 క్యూసెక్కులు నీరు వస్తోందని తెలిపారు. రాత్రికి నీటిని ఎట్టి పరిస్థితుల్లోనైనా తొలగించేలా పనులు పూర్తిచేస్తామని అన్నారు. రాత్రికి ఎట్టి పరిస్థితుల్లోనైనా పనులు పూర్తి చేస్తామన్నారని... అటు క్యాచ్‌మెంట్లో కూడా ఇప్పటివరకు వర్షం పడలేదని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాత్రికి వర్షం పడితే మాత్రం బుడమేరుకు పై నుంచి నీరు వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తెప్పించుకుని ఈ విషయంపై ఎలా పని చేయాలో ఆలోచిస్తున్నామని చెప్పారు. 32 వార్డులను డివిజన్?ల కింద విభజించి అక్కడ ఉన్న వారికి సమాచారం ఇస్తున్నామని వెల్లడించారు. శానిటేషన్ పనులు 76.2 శాతం జరిగాయని చెప్పారు. ఎక్కడైనా వరద బాధితులకు ఇచ్చే ఆహారం నాణ్యతగా లేకపోతే తయారీ దారులను తప్పించి వేరే వారికి అప్పగిస్తున్నామని తెలిపారు. 3లక్షల 12 వేల 300 ఫుడ్ ప్యాకెట్లను ఇప్పటివరకు పంపిణీ చేశామని అన్నారు. నాలుగు లక్షల 51 వేల ప్యాకెట్ల పాలను పంపిణీ చేశామని సీఎం చంద్రబాబు వివరించారు. 224 ట్యాంకర్ల్లు తాగునీటిని అందించామని, 24 ట్యాంకులు శానిటేషన్?కు వాడుతున్నామని స్పష్టం చేశారు. ప్రజలు పైప్ కనెక్షన్‌ల నుంచి వచ్చే తాగు నీటిని ఇంకా రెండు రోజుల పాటు వాడొద్దని.. పైపుల్లో బురద నీరు వచ్చే అవకాశం ఉండటంతో వాడొద్దని సూచించామని అన్నారు. శానిటేషన్‌కు అన్ని ప్రాంతాల్లో 7100 మంది సిబ్బంది రాత్రి సమయంలో కూడా పనిచేస్తున్నారని తెలిపారు. భారీ వర్షాలతో పాడైన 490 కిలో మీటర్ల రోడ్లను మరమ్మతు చేసినట్లు వివరించారు. భారీ వర్షాలతో వరదలతో నిండిపోయిన 10వేల ఇళ్లను ఇప్పటికే శుభ్రం చేశామని.... రాత్రికి మరో 15వేల ఇళ్లను శుభ్రం చేస్తామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని తెలిపారు. ప్రజా రవాణా విషయంలో 681 వాహనాలు పనిచేస్తున్నాయని.. అలాగే 1300 పీడీఎస్ ట్రక్కులు పనిచేస్తున్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. ఇవేకాకుండా 161 పవర్ బోట్లను ఇంకా

- మిగతా 2లో..



## రాష్ట్రానికి రెండు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

### అవార్డులు అందించిన రాష్ట్రపతి ద్రౌపదిముర్ము

**న్యూఢిల్లీ-సూర్య వాస్తవం**

రాష్ట్రానికి చెందిన ఇద్దరు, తెలంగాణకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులకు 'జాతీయ ఉపాధ్యాయ అవార్డు-2024'లను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం ప్రదానం చేశారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం ఊరందూరుకు చెందిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు కూనాటి సురేష్, కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన ఫిజిక్స్ ఉపాధ్యాయులు మిద్దె శ్రీనివాసరావుకు ఈ అవార్డులు దక్కాయి. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో

- మిగతా 2లో..

## హోరాహోరీగా దులీప్ ట్రోఫీ

- ఫలితం దిశగా ఇండియా సీ, డీ మ్యాచ్
- తొలి ఇన్నింగ్స్‌లో 168 పరుగులకు ఆలౌట్ అయిన ఇండియా సీ
- రెండో ఇన్నింగ్స్‌లోనూ తడబడ్డ ఇండియా డీ
- లెఫ్టార్మ్ స్పిన్నర్ మనవ్ సుతార్ ధాటికి ఇండియా డీ 206/8



## మతహింసకు వ్యతిరేకంగా సమైక్యం కావాలి

### పోప్, ఇండోనేషియా ఇమామ్ పిలుపు



**జకార్తా -సూర్య వాస్తవం:** మతపరమైన హింసకు వ్యతిరేకంగా ప్రపంచ దేశాలన్నీ ఐక్యం కావాలని పోప్

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## భక్తులకు ఆధార్ ప్రామాణికంగా టీటీడీ సేవలు

- స్వామివారి దర్శనం చేసుకున్న భక్తులకు కోరినన్ని లడ్డూలు
- డయల్ యువర్ ఈవోలో టీటీడీ ఈవో జె.శ్యామలరావు

**తిరుమల-సూర్య వాస్తవం**



తిరుమలలో శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులకు ఆధార్ ప్రామాణికంగా టీటీడీ సేవలు అందించేందుకు, కేంద్ర ప్రభుత్వం నుండి ప్రాథమికంగా అనుమతి లభించిందని టీటీడీ ఈవో జె.శ్యామలరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ త్వరలో రాష్ట్ర ప్రభుత్వం నుండి వెలువడనుందని, తద్వారా దర్శన, వసతి, శ్రీవారి సేవ తదితర సేవలను దుర్వినియోగం చేస్తున్న దళారులను అరికట్టవచ్చని చెప్పారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈవో భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ శ్రీవారి భక్తులకు మరింత పారదర్శకంగా లడ్డూ ప్రసాదాలు అందించాలనే లక్ష్యంతో ఆగస్టు 29వ తేదీ నుంచి దర్శనం టోకెన్ లేని వారికి ఆధార్ తో లడ్డూలను అందించే విధానాన్ని టీటీడీ ప్రవేశపెట్టింది. గత కొన్నేళ్లుగా పలువురు దళారులు లడ్డూల బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించాం. తిరుమలలో దళారి వ్యవస్థను అరికట్టి, స్వామివారిని దర్శించుకున్న ప్రతి భక్తుడికి తగినన్ని లడ్డూలు

- మిగతా 2లో..

## కాంగ్రెస్ పార్టీలో చేరిన వినేశ్, బజరంగ్ పూనియాలు



**న్యూఢిల్లీ-సూర్య వాస్తవం**

మాజీ రెజ్లర్లు బజరంగ్‌పూనియా, వినేశ్ ఫోగట్‌లు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరడానికి ముందు ఇరువురు పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో భేటీ అయ్యారు. శుక్రవారం ఉదయం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఖర్గేతో సమావేశమయ్యారు. అనంతరం పార్టీలో చేరనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. త్వరలో

- మిగతా 2లో..

## మతహింసకు వ్యతిరేకంగా సమైక్యం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

ఫ్రాన్సిస్, ఇండోనేషియా ఇమామ్ నజరుద్దీన్ ఉమర్ పిలుపునిచ్చారు. దక్షిణాసియాలోనే అతిపెద్దదైన జకార్తాలోని ఇస్తిఖ్‌లాల్ మసీదులో గురువారం నజరుద్దీన్ ఉమర్‌తో పోప్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా "మానవాళి కోసం మత సామరస్యత"కై వారు పిలుపునిచ్చారు. మతపరమైన హింసకు వ్యతిరేకంగానూ, పర్యావరణ పరిరక్షణకు చేతులు కలపాల్సిందిగా వారు కోరారు. భూగోళం పరిరక్షణకు సమైక్య కార్యాచరణ చేపట్టాలని, సర్వ మతాల మధ్య స్నేహ బంధం కోసం కృషి చేయాలని కోరుతూ ఉమ్మడి డిక్లరేషన్‌పై వారు సంతకాలు చేశారు. ఈ సమావేశానికి పలువురు మతపెద్దలు హాజరయ్యారు. ఈ డిక్లరేషన్ రెండు సందేశాలపై దృష్టి పెట్టిందని నజరుద్దీన్ పేర్కొన్నారు. వాటిలో మొదటి సందేశం 'మానవత్వం ఒకటే. దానికి ప్రత్యామ్నాయం లేదు' అని, 'పర్యావరణాన్ని ఎలా పరిరక్షించుకోవాలి' అన్నది రెండవ సందేశమని తెలిపారు. "మతాల సారం ఒక్కటే. సునిశితంగా పరిశీలించినట్లైతే, మనల్ని ఏదైతే వేరుచేస్తోందో దానికి మించి భగవంతుడిని చేరుకునే క్రమంలో మనందరం యాత్రికులం. మనమంతా సోదరులం.' అని పోప్ పేర్కొన్నారు. ఘర్షణలను, యుద్ధాలను రేకెత్తించడానికి మతాన్ని ఆయుధంగా వినియోగించవద్దని హెచ్చరించారు. పర్యావరణ సంక్షోభం మానవ నాగరికత అస్థిత్వానికి ముప్పుగా మారుతోందని అన్నారు. యుద్ధాలు, సంఘర్షణలు వంటి మానవాళి భవిష్యత్తును నాశనం చేసే సంక్షోభాలను ఎదుర్కొనే, వాటిని పరిష్కరించే బాధ్యతను తాము తీసుకుంటామని తెలిపారు. ఆసియా పసిఫిక్ దేశాల్లో రెండు వారాల పర్యటనలో భాగంగా మంగళవారం పోప్ ఇండోనేషియా చేరుకున్నారు. అనంతరం పపువా న్యూగినియా, తూర్పు తైమూర్, సింగపూర్‌లలో కూడా పర్యటించనున్నారు.

## రాష్ట్రానికి రెండు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రపతి ఈ అవార్డులను అందజేశారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా కేంద్ర విద్యాశాఖ ఎంపిక చేసిన ఉత్తమ ఉపాధ్యాయులకు ఏటా సెప్టెంబరు 5న అవార్డులను ప్రదానం చేస్తారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 82 మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వారిలో 50 మంది డిపార్ట్మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అండ్ లిటరసి, 16 మంది హయ్యర్ ఎడ్యుకేషన్, 16 మంది మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంటు నుంచి ఎంపికయ్యారు. ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రంతోపాటు రూ.50 వేల నగదు బహుమతిని రాష్ట్రపతి అందజేశారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన వినేశ్, బజరంగ్ పూనియాలు

(మొదటిపేజీ తరువాయి)

హర్యానా అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. దీంతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్కరే పోటీ చేస్తారా లేదా ఇద్దరూ పోటీ చేస్తారా అనేది త్వరలో తెలుస్తుందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. భారత రైల్వేకు మాజీ రెజ్లర్ వినేశ్ ఫోగట్ శుక్రవారం రాజీనామా చేశారు. భారతీయ రైల్వేకు సేవ చేయడం నా జీవితంలో మరపురాని మరియు గర్వించదగిన సమయం అని ఆమె ఎక్స్‌లో పేర్కొన్నారు. తన రాజీనామా లేఖను కూడా పోస్ట్ చేశారు. ఉత్తరాది రైల్వేలో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డి)గా ఆమె విధులు నిర్వహిస్తున్నారు. మరో రెజ్లర్ బజరంగ్ పూనియా కూడా రైల్వేకు రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల రిత్యా ఉద్యోగాలకు రాజీనామా చేస్తున్నట్లు ఇరువురు లేఖల్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది.

## ఉపాధి హామీ పనులను అషీస్ గుప్త

**తిరుపతి-సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా నందు అమలు జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు, దాని అనుసంధానంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను, అమృత్ సరోవర్ చెరువు అభివృద్ధి పనులు, ఫారం పాండ్లు, హార్టి కల్చర్, ఫ్లోరి కల్చర్ తదితరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి భారత గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ సెక్రటరీ ఆశిష్ గుప్తా సంతృప్తి వ్యక్తం చేసారు. శుక్రవారం ఉదయం నుండి భారత గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ సెక్రెటరీ సుడిగాలి పర్యటన చేపట్టి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. వడమాలపేట గ్రామం నందు పంట సంజీవని ఫారం పాండును పరిశీలించారు. అలాగే పర్కులేషన్ పాండులు, సమతల కందకాలు (ట్రెంచెస్) లను, ఎల్.ఎం కండ్రిగ గ్రామం వడమాలపేట మండలం నందు హార్టికల్చర్ ప్లాంటేషన్ కార్యక్రమం కింద కొబ్బరి, జామ, మామిడి తోటలకు సంబంధించి, ఫ్లోరికల్చర్ పూల తోటల కింద గులాబీ తోటలను కదిరి మంగళం వడమాల పేట మండలం నందు పరిశీలించారు. మినీ అమృత్ సరోవర్ ను ఏర్పేడు మండలం కోబాక గ్రామం నందు పరిశీలించారు. అనంతరం అప్పలాయగుంట నందు అమృత సరోవర్ పథకం కింద చెరువుల అభివృద్ధి పనులను, గణేశ్వర పురం రామచంద్రపురం మండలం నందు పట్టుపురుగుల పెంపకానికి సంబంధించి యూనిట్ ను, అలాగే రేణిగుంట మండలం గాజులమండ్యం వద్ద పెద్ద చెదుళ్లలో 400కు పైగా చైన్ పద్ధతిలో లింక్ అయిన పర్కులేషన్ పాండ్లను పరిశీలించారు. అంతే కాకుండా ఏర్పేడు మండలం బందార్లపల్లి అమృత సరోవర్ చెరువు అభివృద్ధి పనులను, కల్లూరు అమృత సరోవర్ చెరువు అభివృద్ధి పనులను, ఏర్పేడు మండలం పాగలి ఎమ్ఐ ట్యాంకును ఆకస్మికంగా సదరు భారత డిప్యూటీ సెక్రటరీ తనిఖీ చేసి ఉపాధి హామీ పథకం పనుల అమలు తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

# హోరాహోరీగా దులీప్ ట్రోఫీ

(మొదటిపేజీ తరువాయి)

◆ 5 వికెట్లు తీసిన మనవ్ సుతార్

◆ అర్ధసెంచరీలో రాణించిన శ్రేయస్స్ అయ్యర్, పడిక్కిల్

**అనంతపురం-సూర్య వాస్తవం:** దులీప్ ట్రోఫీలో భాగంగా అనంతపురంలోని ఆర్డీటీ స్పోర్ట్స్ విలేజ్ ప్రధాన మైదానంలో జరుగుతున్న ఇండియా సీ, డీ మ్యాచ్ హెూరాహెూరీగా శుక్రవారం హెూరా హెూరీగా సాగింది. ఇరు జట్ల బౌలర్లు పోటాపోటీగా రాణిస్తుండడంతో మూడో రోజే ఫలితం వెలువడే అవకాశం కన్పిస్తోంది. శుక్రవారం ఆటముగిసే సమయానికి ఇండియా డీ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 49 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 206 పరుగులు చేసింది. ప్రస్తుతం ఆ జట్టు 202 పరుగుల ఆధిక్యంతో కొనసాగుతోంది.



**రాణించిన ఇంద్రజిత్..ఇండియా సీకి స్వల్ప ఆధిక్యం:**

ఓవర్‌నైట్ స్కోర్ 91/4తో ప్రారంభించిన ఇండియా సీ జట్టు 48.3 ఓవర్లలో 168 టరుగులకు ఆలౌట్ అయ్యింది. రెండో రోజు కేవలం 77 పరుగులు మాత్రమే చేసి మిగితా ఆరు వికెట్లను ఇండియా సీ జట్టు కోల్పోయింది. జట్టులో బాబా ఇంద్రజిత్ అర్ధ సెంచరీతో ఆకట్టుకున్నాడు. 149 బంతులు ఎదుర్కొన్న బాబా ఇంద్రజిత్ 9 బౌండరీ సహాయంతో 72 పరుగులు చేశాడు. వికెట్ కీపర్ అభిషేక్ పోరెల్ 34 పరుగులు మాత్రమే చేశారు. ఎక్స్‌ట్రాల రూపంలో 16 పరుగులు వచ్చాయి. ఇండియా డీ బౌలర్లలో పేసర్ హర్షిత్ రాణా 4, అక్షర్ పటేల్ 2, సరాన్ష్ జైన్ 2, అర్ష్‌దీప్ సింగ్, ఆదిత్య థాకరే చెరో వికెట్ తీసుకున్నారు.

**ఇండియా డీ తడబాటు:**

ఇండియా డీ జట్టు రెండో ఇన్నింగ్స్‌లోనూ తడబడింది. ఇండియా సీ లెఫ్టార్మ్ స్పిన్నర్ మనవ్ సుతార్ 5 వికెట్లు తీసి..ఇండియా డీను కట్టడి చేశాడు. 15 ఓవర్లలో 30 పరుగులిచ్చి 5 వికెట్లు తీసుకున్న సుతార్, పడిక్కల్, శ్రీకర్‌భరత్, సరాన్ష్‌జైన్, అర్ష్‌దీప్ సింగ్, రికీ బుయిలను పెవిలియన్‌కు పంపాడు. అతనికితోడుగా పేసర్ వైశాక్ రెండు వికెట్లు తీసి రాణించాడు. దీంతో ఇండియా డీ జట్టు ఆటముగిసే సమయానికి 8 వికెట్లు కోల్పోయి 206 పరుగులు చేసింది. క్రీజ్‌లో అక్షర్ పటేల్ 11, హర్షిత్ రాణా 0 ఉన్నారు. జట్టులో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, దేవదత్ పడిక్కిల్ అర్ధ సెంచరీలతో జట్టుకు గౌరవప్రదమైన స్కోర్ నందించే ప్రయత్నం చేసినా..మిగితా బ్యాట్స్‌మెన్‌లు విఫలం కావడంతో డీ జట్టు భారీ స్కోర్ చేయలేకపోయింది. శ్రేయస్ అయ్యర్ కేవలం 44 బంతుల్లో 9 ఫోర్లు, ఒక సిక్సర్ సహాయంతో 54, పడిక్కిల్ 70 బంతుల్లో 8 బౌండరీల సహాయంతో 56 పరుగులు చేశారు. మరో బ్యాట్స్‌మెన్ రికీ బుయి 44(5 ఫోర్లు, ఒక సిక్సర్) పరుగులు చేశాడు. ఇండియా డీ జట్టు 202 పరుగుల ఆధిక్యంలో ఉంది.

# వరద బాధితులందరినీ ఆదుకుందాం..!

(మొదటిపేజీ తరువాయి)

అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. భారీ వర్షాల వల్ల ఏపీ వ్యాప్తంగా 28మంది చనిపోయినట్లు గుర్తించామని అన్నారు. వారి అంత్యక్రియలు చేసుకోవడనికి ప్రభుత్వ పరంగా కుటుంబ సభ్యులకు అవకాశం ఇచ్చామని అన్నారు. చాలామంది ఎలక్ట్రిషియన్లు, ప్లంబర్లు మరమ్మతులు చేయడానికి అవసరమని అన్నారు. ఏపీలో ఇప్పుడు ఉన్న పరిస్థితుల దృష్ట్యా ఉపాధి కల్పించాలని అనుకుంటున్నామని అన్నారు. డ్రోన్లతో తొలిసారిగా ఆహారం అందించామని చెప్పారు. ఎవరైనా కష్టాల్లో ఉంటే వారికి మంత్రులు, అధికారులు, టీడీపీ నేతలు త్వరగా సాయం అందించాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. మూడు రోజుల్లో వరద బాధితులకు చేయాల్సిన సాయం చేస్తామని మాటిచ్చారు. డ్రైఫ్రూట్‌లు, పాలు వారికి అందజేస్తామని హామీ ఇచ్చారు. ఎక్కడా అంటువ్యాధులు రాకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. కొంతమంది వ్యాపారులు కూరగాయలు రేట్లు విపరీతంగా పెంచేశారని అన్నారు. రూ, 2, 5, 10లకు మాత్రమే వాటిని ఇవ్వాలని చెప్పామని అన్నారు. వ్యాపారులు రేట్లు పెంచకుండా ఉండేందుకు అధికారులు నిఘా పెట్టారని అన్నారు. ఇంట్లో పుస్తకాలు పోవడం, ఎలక్ట్రానిక్ వస్తువులు కూడా నీటిలో కొట్టుకు పోయాయని సీఎం చంద్రబాబు తెలిపారు. శనివారం ఉదయం కేంద్ర ప్రభుత్వానికి వరద సహాయం కోసం రిపోర్టు పంపిస్తామని తెలిపారు. ప్రముఖ కంపెనీలు వరద బాధితులకు సాయం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వ్యాపారులు చాలా మంది దెబ్బతిన్నారని... వారు నిలదొక్కుకునేలా ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. ప్రజలకు ఇస్సురెన్సు క్లెయిమ్ చేయాలంటే.. ప్రభుత్వ పరంగా సాయం చేస్తామని వివరించారు. వరదల నుంచి విజయవాడకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపడతామని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రకాశం బ్యారేజ్ కు 12 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చిందని.. . దీంతో బ్యారేజ్ ను కూడా స్ట్రీమ్ లైన్ చేసేలా చర్యలు చేపడతామని చెప్పారు. ఏపీని ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని సాయం కోరామని అన్నారు. ముంపు ప్రాంతాల్లో లోన్లను రీషెడ్యూల్ చేయిస్తామని అన్నారు. డాక్యుమెంట్లు పోయిన వారికి తిరిగి ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకోసం అవసరమైన రిపోర్టు తాను పంపిస్తానని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# 10 నుంచి పొలం పిలుస్తోంది

### - జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్

**తిరుపతి-సూర్య వాస్తవం:** ఈనెల 10వ తేదీ నుండి రాష్ట్ర వ్యాప్తంగా " పొలం పిలుస్తోంది" అనే కార్యక్రమం నిర్వహించబడుతుందని, జిల్లాలోని రైతు సోదరులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా కలెక్టర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాదరావు తదితర సంబంధిత అధికారులతో కలిసి "పొలం పిలుస్తోంది" కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పొలం పిలుస్తోంది అనే వినూత్న కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఉపయోగార్ధం చేపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం రైతులకు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ఈ వ్యవసాయ విస్తరణ కార్యక్రమం అని, రైతులకు నూతన సాంకేతిక పద్ధతులను తెలిపి, వారికి సంబంధించిన పొలాల సంరక్షణ, తక్కువ పెట్టుబడితో ఎక్కువ పంట దిగుబడి వచ్చే విధంగా చేపట్టాల్సిన మెలకువలపై వారికి సూచనలు సలహాలు ఇవ్వడం అని, వారి సమస్యలను తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకునే వేదిక ఈ పొలం పిలుస్తోంది అనే కార్యక్రమమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా వ్యవసాయ శాఖ తో పాటు అనుబంధ శాఖలైన ఉద్యానవన శాఖ, పట్టు పరిశ్రమ, పశు సంవర్ధక శాఖ, షుగర్ కేన్, మార్కెటింగ్ శాఖ,




వ్యవసాయ శాస్త్ర వేత్తలు, వ్యవసాయ నిపుణులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతి వారంలో మంగళ, బుధవారం రోజులలో మాత్రమే ఉంటుందని ఉదయం క్షేత్రస్థాయిలో పొలాలను పరిశీలించి అనంతరం ఒకచోట రైతులతో కలిసి కూచుని పొలంలో పరిశీలించిన అంశాలపై రైతులతో చర్చించి సలహాలు సూచనలు ఇవ్వడం జరగాలని, సమస్యల సత్వర పరిష్కారం కొరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే మధ్యాహ్నం మరొక గ్రామంలో క్షేత్ర స్థాయిలో పొలాలను సదరు శాఖలు పరిశీలన చేసి రైతులతో సమావేశమై చర్చించడం జరుగుతుందని ఇలా వారంలో నాలుగు గ్రామాలు కవర్ అయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుని రైతులకు ముందస్తు సమాచారం అందించి రైతుల సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. గోడ పత్రిక విడుదల కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ధనుంజయ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in

# సంపాదకీయం

## విపత్తులు నేర్పిన పాఠాలు ఏంటీ..!

ప్రభుత్వాలు వస్తుంటాయి పోతుంటాయి. కానీ, దశాబ్దాలుగా ఆయా శాఖల్లో ఉండే అధికారులు పరిస్థితులను అంచనా వేయలేరా..? సంబంధిత శాఖల ఉన్నతాధికారులకో.. లేదా మంత్రులకో ముందుగానే ప్రమాద హెచ్చరికలపై సమాచారం ఇవ్వాలి కదా..? సరే, వరద విషయంలో వైఫల్యం స్పష్టంగానే ఉందీ.. పోనీ, సహాయక చర్యల్లో అయినా బాధితులకు అందుబాటులో ఉన్నారా అంటే.. ఇక్కడ కూడా అధికారుల అలసత్వం కనిపిస్తుందని బాధితులు వాపోతున్నారు. ఇంతకీ, ఈ విపత్తు నుండి నేర్చుకోవాల్సిన పాఠాలేంటి..?వరదల విలయానికి రెండు తెలుగు రాష్ట్రాలూ అల్లాడాయి. పీకల్లోతు నీళ్లు.. ఎటూ వెళ్లలేని పరిస్థితి. కుండపోత వర్షంలో కుటుంబాలను కాపాడుకోలేని దుస్థితి. నదీ ప్రవాహంలో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారా అన్నట్లు.. ఎటు చూసిన నీటి ప్రవాహం. ఇది ఊహించని పరిణామమే కావచ్చు.. కానీ అంచనా వేయలేని పరిస్థితి కాదన్నది అందరు చెబుతున్న మాట. రెండు రాష్ట్రాల్లోనూ ఆయా శాఖలు, విభాగాలు ఉన్నాయి. వాతావరణ శాఖ నిరంతరం పరిస్థితిని అంచనా వేస్తూ నివేదికలు తయారు చేస్తుంది. వర్షం ఎప్పుడొస్తుందీ..? ఎంత మేరకు వర్షం పడుతుంది..? ఎక్కడెక్కడ జాగ్రత్తలు పాటించాలి..? అనే అంశాలు క్లియర్‌గా ఉంటాయి. అలాగే, నదుల ప్రవాహం, నీటి పరిమాణం, దారి మళ్లింపులు, చెరువులు పరిస్థితులు వంటి విషయాలను పర్యవేక్షించడానికి పలు శాఖలు వాటి అధికారులు ఉంటారు. ముఖ్యంగా వర్షాకాలం వస్తుందంటే సంబంధిత శాఖలు మరింత అప్రమత్తంగా ఉండాలి. మరి ఏం జరిగింది.. ? వీళ్లంతా ఏమై పోయారు..? వాతావరణ శాఖ నివేదికలు తప్పయ్యాయా..? నిపుణులు అంచనా వేయలేదా..? అధికారులు నిర్లక్ష్యం వహించారా..? తప్పు ఎక్కడ జరిగింది..?భారీ వర్షాలు వరదల కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 4.5 లక్షల మంది ప్రభావితమయ్యారు. 166 సహాయ శిబిరాలు ఏర్పాటు చేసి.. 30 వేల మందికి పైగా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అయితే, ఇలాంటి పరిస్థితుల మధ్య కూడా బాధితులకు సహాయం సరిగ్గా అందట్లేదనే ఆరోపణలు వస్తున్నాయి. వర్షం తగ్గినప్పటికీ వరద కష్టాలు మాత్రం ప్రజల్ని ఇంకా వదిలిపెట్టలేదు. రెండు రోజులు నరకయాతన చూసిన ప్రజలు ఇప్పటికీ తాగడానికి నీళ్లు, తినడానికి ఆహారం కోసం తీవ్రమైన కష్టాలు పడుతున్నారు. కనీసం, సురక్షిత ప్రాంతాలకు వెళ్లడానికి కూడా సహాయక చర్యలు సరిగ్గా అందట్లేదని వాపోతున్నారు.ఈ పరిస్థితిపై ఏపీ సీఎం చంద్రబాబు అధికారుల్ని హెచ్చరించారు. గత ప్రభుత్వంలో మాదిరిగా ఉంటామంటే కుదరదని వార్నింగ్ ఇచ్చారు. మొద్దు నిద్ర వీడాలన్నారు. అధికారుల పనితీరు ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా ఉండాలన్నారు. పరిస్థితిని అంచనా వేయలేకపోయారు సరే.. కనీసం, సహాయక చర్యల్లో అయినా నిబద్ధతను చూపించమని అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. బుడమేరు ముంపు ప్రాంతాల్లో డ్యూటీలో ఉన్న అధికారుల తీరును ఎప్పటికప్పుడు మంత్రులు పర్యవేక్షించాలని కోరారు. కాగా.. కొంత మంది అధికారులు కావాలనే సహాయక చర్యలకు ఆటంకం కల్పిస్తున్నారని సీఎంకు ఫిర్యాదులు వెళ్లే పరిస్థితికి అధికారులు చేరుకున్నారు. అయితే, ఎవరు డ్యూటీలో ఉండగా సహాయక చర్యల్లో జాప్యం జరుగుతుందో వారిపై సీఎం చంద్రబాబు నివేదిక కోరినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో జక్కంపూడిలో ఒక అధికారిని సస్పెండ్ చేయగా.. మంత్రుల్ని సైతం ఉపేక్షించేది లేదంటూ సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారుప్రతి అధికారీ సహాయక చర్యల్లో పాల్గొనాలని చంద్రబాబు ఆదేశించారు. మానవతా దృక్పథంతో అధికారులు స్పందించాలి అన్నారు. మన కుటుంబసభ్యులే వరదల్లో చిక్కుకుంటే ఎలా రియాక్ట్ అవుతామో అలాగే స్పందించాలన్నారు. చనిపోయిన వారి బాడీలను తీయకపోతే.. రేపు మనం చనిపోయినప్పుడు ఎవరు తీస్తారంటూ ప్రశ్నించారు. ఇది తీవ్రమైన సమస్య అని, ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో అధికారులే కాదు, మానవత్వంతో ప్రతి ఒక్కరూ స్పందించాలని అన్నారు. ప్రజల పరిస్థితులను అర్థం చేసుకుంటూ అధికారులు నడుచుకోవాలని సూచించారు.అయితే, ఈ కథ ఇంతటితో ముగిసిందని అనుకోలేని పరిస్థితి. ఎందుకంటే, తెలంగాణ రాష్ట్రానికి మరో భారీ ప్రమాదం పొంచి ఉందని తెలుస్తోంది. సెప్టెంబర్ 5న బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. దీని ప్రభావం రెండు తెలుగు రాష్ట్రాల పైన ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. ఉత్తర అండమాన్ సమీపంలో ఏర్పడనున్న ఈ అల్పపీడనం క్రమంగా తుఫాన్‌గా మారే అవకాశం ఉందని ఈ తుఫాను ఉత్తరాంధ్ర దక్షిణ ఒడిస్సా తీరం దాటుతుందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఒక వాయుగుండం సృష్టించిన విలియం మరవకముందే మరో తుఫాను గండం ముంచుకొస్తున్న క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే, ప్రజలు అప్రమత్తంగా ఉండే మాట అటుంచితే? తాజా వరదలతో పాఠాలు నేర్చుకోవాల్సింది అధికారులేనని ప్రజలు అంటున్నారు.భవిష్యత్తులో ఇంకెప్పుడూ ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ముఖ్యంగా అధికారులపైనే ఉంది. ప్రభుత్వం ఆదేశాలిచ్చేది ఆయా శాఖల అధికారులు ఇచ్చే నివేదికలను బట్టే కాబట్టి ఇలాంటి పరిస్థితుల్లో అధికారులు ముందే మేల్కొనాల్సిన అవసరం ఉంది. వాతరవణ శాఖ హెచ్చరికలను పరిగణలోకి తీసుకుంటూ ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలి. రహదారులు పరిరక్షణ, రవాణా సౌకర్యాలు, చెరువుల పర్యవేక్షణ, నదీ ప్రవాహాల అంచనాల విషయంలో ఎలాంటి అలసత్వం వహించినా అది మరింత నష్టానికి దారితీసే పరిస్థితి ఉంటుందని అర్థం చేసుకోవాలి. గత అనుభావాల సమాచారం ఇప్పుడు లేదని చెప్పుకోడానికి అవకాశం ఉన్నా? ఇప్పటి అనుభావాల ప్రభావం ఎలాంటిదో చెప్పే సమాచారం పుష్కలంగా ఉంది. కనీసం, దీన్ని పరిగణలోకి తీసుకొని, రాబోయే రోజుల్లో ఇలాంటి విపత్తును తట్టుకునే ఏర్పాట్లు చేయాలి. దీనికి, ప్రతి అధికారీ నిబద్ధతతో పనిచేయాలి.

# భక్తులకు ఆధార్ ప్రామాణికంగా టీటీడీ సేవలు

(మొదటిపేజీ తరువాయి)

అందించేందుకు టీటీడీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా, దర్శనం టోకెన్లు లేనివారికి ఆధార్ కార్డుపై రోజువారి రెండు లడ్డూలను మాత్రమే జారీ చేయాలని టీటీడీ నిర్ణయించింది. అలాగే చాలా కాలంగా భక్తులు విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ, బయట ప్రాంతాలలో ఉన్న టీటీడీ ఆలయాలు, చెన్నై, బెంగళూరు, వెల్లూరులలోని టీటీడీ సమాచార కేంద్రాలలో లడ్డూల డిమాండ్ ఉన్నప్పటికి మేము పంపలేకపోయాము. ప్రస్తుతం పంపిస్తున్నాం. గత నాలుగు రోజుల్లో దాదాపు 75 వేల లడ్డూలు పంపబడ్డాయి. దీనిని శాశ్వత ప్రాతిపదికన అమలు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. తిరుమలలో దర్శనం టోకెన్లు ఉన్న భక్తులకు ఒక ఉచిత లడ్డూతో పాటు, రూ.50/- ప్రాతిపదికన కోరినన్ని లడ్డూలు (స్టాక్ లభ్యత ఆధారంగా) అందజేస్తున్నాం. దీనికి ఆధార్ కార్డు అవసరం లేదు. ఆవు నెయ్యి నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు లడ్డూ ప్రసాదాల నాణ్యతను పెంచేందుకు, సువాసన, రంగు, రుచి ఉండే నెయ్యి కొనుగోలు చేసేందుకు ప్రస్తుతం ఉన్న టెండర్ షరతులను అనుసరించి నాణ్యమైన నెయ్యి కొనుగోలు చేస్తున్నాం. గతంలో కల్తీ నెయ్యి సరఫరా చేసిన కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్ పెట్టడం జరిగింది. ముఖ్యంగా నెయ్యి యొక్క నాణ్యత ప్రమాణాలను పరిశీలించేందుకు నెయ్యి కల్తీనా కాదా తెలుసుకునే దానికి, నేషనల్ డైరీ డెవలప్మెంట్ బోర్డు టిటిడికి ఒక గ్యాస్ క్రోమాటోగ్రాఫ్ మరియు హెచ్‌పిఎల్‌సిని విరాళం అందిస్తామని తెలిపారు. దీని ధర సుమారు రూ.80 లక్షల వరకు ఉంటుంది. వీటిని ఈ ఏడాది డిసెంబర్ నాటికి అమరుస్తారు. అన్నప్రసాదం నాణ్యతను మెరుగుపరిచేందుకు, ప్రస్తుతం ముడి సరుకుల సేకరణ ప్రక్రియను అధ్యయనం చేయడానికి నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేశాం. త్వరలోనే కమిటీ నివేదికను అందజేస్తుంది. అదేవిధంగా, శ్రీవారి అన్నప్రసాదాల రుచిపై యాత్రికుల నుండి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో, శ్రీవారి ఆలయంలో నైవేద్యాల కోసం సేకరిస్తున్న సేంద్రియ పదార్థాల నాణ్యతను తనిఖీ చేయడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఆ కమిటీ నివేదిక 15 రోజులలో వస్తుంది. నివేదికను అనుసరించి తదుపరి



చర్యలు చేపడతాం. కాలినడకన వచ్చే భక్తులకు అలిపిరి పాదాలమండపం వద్ద దివ్యదర్శనం టోకెన్లు జారీ చేయు కౌంటర్లు మరియు గాలిగోపురం వద్ద స్కానింగ్ కౌంటర్లను త్వరలో పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 4 నుండి 12వ తేదీ వరకు, ముఖ్యంగా అక్టోబర్ 8వ తేదీ శ్రీవారి గరుడసేవను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాం. జూన్ నెల మొదటి వారంలో యాత్రికులకు వారానికి 1.05 లక్షల ఎస్ఎస్ డి టోకెన్లు ఇవ్వగా, ఇప్పుడు వారానికి 1.63 లక్షల టోకెన్‌లు జారీ చేస్తున్నాం. ఎస్ఎసడి టోకెన్స్ పెంచిన కారణంగా ఈ టోకెన్ పొందిన భక్తుల నిరీక్షించే సమయం గణనీయంగా తగ్గింది. నారాయణగిరి షెడ్ల వద్ద క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాదం, పారిశుద్ధ్యం, ఇతర ఏర్పాట్లు క్రమబద్ధీకరించి, వీటిని నిరంతరం పర్యవేక్షించేందుకు సీనియర్ అధికారులను నియమించాం. అన్నప్రసాదం ట్రస్ట్‌ను మెరుగుపరచడానికి, మరింత బలోపేతం చేయడానికి కొన్ని స్వల్పకాలిక మరియు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేశాం. ఈ నిపుణుల కమిటీ సూచనల మేరకు మేము చర్యలు తీసుకుంటున్నాం. అన్నప్రసాద విభాగాన్ని ఆధునికరించడంతో పాటు అన్నప్రసాదాల పంపిణీ వ్యవస్థను పటిష్టం చేసేందుకు త్వరలో బెంగళూరుకు, హైదరాబాద్ కు చెందిన నిపుణులు తిరుమల లోని వివిధ అన్నప్రసాద కేంద్రాలను సందర్శించనున్నారు. వీరందించే సూచనల మేరకు భవిష్యత్తు అవసరాల దృష్ట్యా అన్నప్రసాద విభాగాన్ని శాశ్వతంగా సంపూర్ణ స్థాయిలో ఆధునికరిస్తాం. తిరుమలలో 25.08.2024 నుండి 30.08.2024 వరకు శ్రీవారి ఆలయం, వసతి గృహాల సముదాయాలలో బొద్దింకలు మరియు ఎలుకల నిర్మూలన కోసం పెద్ద ఎత్తున స్టేపుల్ హడ్సన్ బృందాలతో నిర్మూలన చర్యలు చేపట్టాం. ఈ కార్యక్రమం నిరంతరం జరుగుతుంది. శ్రీవారి భక్తుల నుదుటన పవిత్రమైన "తిరునామం" ధారణ కార్యక్రమం, తిరుమలలోని ముఖ్యమైన ప్రాంతాలలో ఈ రోజు నుండి పునఃప్రారంభిస్తున్నాం అన్నారు. కార్యక్రమంలో అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సివిఎస్వో శ్రీధర్, సిఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

### క్యాన్సర్ లక్షణాలను గుర్తించిన వారికి..

# త్వరగా నిర్ధారణ పరీక్షలు చేయండి

## చిత్తూరు జిల్లా జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశంలో తిరుపతి ఎంపీ గురుమూర్తి

**చిత్తూరు-సూర్య వాస్తవం:** తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి జరిగిన చిత్తూరు జిల్లా జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి తిరుపతి జిల్లా పరిధిలో క్యాన్సర్ స్క్రీనింగ్ గూర్చి వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు పలు ప్రశ్నలు సంధించారు. వైద్య ఆరోగ్య శాఖ వారు ఇచ్చిన లెక్కల ప్రకారం 77,717 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ చేశామని 190 మందికి క్యాన్సర్ నిర్ధారణ అయిందని వారు జడ్పీ సమావేశంలో ఇచ్చిన డ్యాకుమెంటులో పొందుపరిచ బడింది. కాగా ఈ సమావేశంలో ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేత్రుత్వంలోని గత ప్రభుత్వ హయాంలో దేశంలోనే మొట్ట మొదటగా మన రాష్ట్రంలో తిరుపతి జిల్లాలో రెండు "పింక్ బస్సుల"లో క్యాన్సర్ స్క్రీనింగ్ ల్యాబ్ లు ఎర్పాటు చేయబడిందని వీటి ద్వారా ఆయా ప్రాంతాలలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారని ఆయన అన్నారు. అల్ట్రా సౌండ్, ల్యాబ్ టెస్ట్ వంటి పరీక్షలు స్విమ్స్ తో అనుసంధానం



చేయబడిందని అన్నారు. 19 ప్రైమరీ హెల్త్ సెంటర్ల పరిధిలో 2,70,234 మంది ఉండగా ఎం.ఎల్.హెచ్.పి ల ద్వారా 1,76,776 మందిని సర్వే చేసారని అందులో 78,847 మందికి క్యాన్సర్ పాజిటివ్ లక్షణాలు ఉన్నాయని గుర్తించడం జరిగిందని అన్నారు. ఇందులో క్యాన్సర్ నిర్ధారణ కోసం "పింక్ బస్సు" వద్దకు తీసుకు రాబడినవారు 8053 అని అందులో 929 మందికి క్యాన్సర్ ఉందని నిర్ధారణ అయిందని అన్నారు.

కానీ "పింక్ బస్సు" వద్దకు నిర్ధారణ పరీక్షలకు తీసుకు రావలసిన వారు సుమారు 70 వేల మంది ఉన్నారని వారిని "పింక్ బస్సు" వద్ద స్క్రీనింగ్ చేసినట్లుయితే మొదటి దశలోనే క్యాన్సర్ గుర్తించి చికిత్స అందించడం వలన క్యాన్సర్ బారిన పడ్డ వారిని కాపాడవచ్చని ఎంపీ గురమూర్తి అన్నారు. క్యాన్సర్ నిర్ధారణ అయిన 929 మందిలో స్విమ్స్ హాస్పిటల్ లో రకరకాల క్యాన్సర్ తో 250 మంది చికిత్స పొందుతున్నారని అన్నారు. అధికారులతో సమన్వయం చేసుకొని సరైన డేటాని పొందు పరచడం లేదని అధికా రులని నీలదీశారు. పాధమిక స్థాయిలో క్యాన్సర్ లక్షణాలను గుర్తింపబడిన అందరికి క్యాన్సర్ స్క్రీనింగ్ చేయడంలో ఎందుకు జాప్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. అలాగే క్యాన్సర్ నిర్ధారణ అయిన వారికి చికిత్స అందేలా చేయాలని వారిని కోరారు. క్యాన్సర్ వలన దేశంలో ప్రతి యేటా 9,16,000 వేల మంది మరణిస్తున్నారని గుర్తు చేశారు.

## తిరుమలలో భక్తులకు తిలక ధారణ ప్రారంభించిన టిటిడి

**తిరుమల-సూర్య వాస్తవం:** తిరుమలలో శ్రీవారి భక్తులకు తిలక ధారణ కార్యక్రమాన్ని టిటిడి ఈవో జె.శ్యామల రావు శుక్రవారం ప్రారంభించారు. తిరుమల ఏటీసీ సర్కిల్ వద్ద ఈవోకు, భక్తులకు శ్రీవారి సేవకులు తిలక ధారణ చేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, తిరుమలలో భక్తులకు తిలక ధారణ కార్యక్రమాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. శ్రీవారి సేవకులు తిరుమలలోని ఏటిసి, సుపథం, శ్రీ



వరాహస్వామి ఆలయం, కళ్యాణకట్ట, విక్యూసి 1, 2 ల వద్ద నిరంతరాయంగా తిలక ధారణ చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈఓ వీరబ్రహ్మం, సివిఎస్ఓ శ్రీధర్, సిపిఆర్ఓ డాక్టర్ టి.రవి, పిఆర్ఓ (ఎఫ్ ఏసి) కుమారి పి.నీలిమ, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



## కేజీబీవీ పాఠశాలలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

**- పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**

రాయచోటి-సూర్యవాస్తవం: కేజీబీవీ పాఠశాలలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం సుండుపల్లెలోని కేజీబీవీ ఆదర్శ పాఠశాల, వసతి గృహాన్ని రాజంపేట సబ్ కలెక్టర్ నైదియ దేవితో కలిసి జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలను నిర్వహిస్తున్న తీరుపై ఉపా ధ్యాయులు, విద్యార్థినులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెసిడెన్షియల్ పాఠశాలో ఎంతమంది విద్యార్థినిలు ఉన్నారు, అమలు చేస్తున్న మెనూ, భోజనం, వసతి ఏర్పాట్ల గురించి వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థినులతో ఒక సాధారణ వ్యక్తిలా మమేకమై వారితోపాటు క్రింద కూర్చుని పలు అంశాలలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థినులతో కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన ఇసుకను మంచి రేట్లకే అందించాలి

**- రాష్ట్ర మంత్రి మండిపల్లితో పంతగాని**

రైల్వేకోడూరు- సూర్యవాస్తవం: రాష్ట్రంలోని కూలీలకు ఇసుక లేక ఇక్కట్లు పడుతున్న తరుణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు కూలీలను ఆదుకోవాలని ఉద్దేశంతో ఇసుకను ఉచితంగా అందజేసే విధానాన్ని రూపొందించారు. రాజంపేట డివిజన్ పరిధిలోని బాలరాజు పల్లిలో



రాష్ట్ర మంత్రి రాంప్రసాద్ రెడ్డి తో రైల్వేకోడూరు టిడిపి యువ నాయకులు రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్ శుక్రవారం చర్చించి రైల్వే కోడూరు నియోజక వర్గానికి సంబంధిత ఇసుక ప్లాంటును ఏర్పాటు చేయాలని ఆయన రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో కోరినట్లు పంతగాని నరసింహ ప్రసాద్ తెలిపారు. ప్రతికూలికి పని దక్కాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రైల్వే కోడూరుకు బాలరాజుపల్లి ప్లాంట్ ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని పంతగాని అన్నారు. కాగా రానున్న రోజుల్లో ఇసుకతో కూలీలకు ఎటువంటి జాప్యం జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ఉన్నతాధికారులతో చర్చించినట్లు అందుకు రాష్ట్ర మంత్రి రాంప్రసాద్ రెడ్డి కూలీలకు ఇసుకను అందించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే కోడూరు కు చెందిన కస్తూరి దినేష్ నాయుడు, మందపాటి శంకరయ్య, చిగురుపాటి శంకర తో పాటు పలువురు టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్జిత కీర్తిమంతుడు కలెక్టర్ శివ శంకర్

**- విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు**

మైదుకూరు -సూర్యవాస్తవం: తెలుగు భాషకీర్తిని కల్లమల్ల శాసనం ద్వారా దిగంతాలకు వ్యాపింపచేసిన ఆర్జిత కీర్తి మంతుడు కలెక్టర్ శివశంకర్ లోతేటి అని భారత రాష్ట్ర పతి అవార్డు గ్రహీత, తెలుగు భాషా వికాస ఉద్యమం జిల్లా అధ్యక్షుడు విద్వాన్



డాక్టర్ హనుమంతరావు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ శివశంకర్‌లోతేటిని క్యాంప్ ఆఫీస్‌లో కలిసి శాలువా పూలమాల మెమెం టోతో ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా విద్వాన్ గానుగపెంట హనుమంతరావు మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాలు మాతృభాష పట్ల ఎంతో అభిరుచి కలిగిన శివశంకర్ లోతేటి మన జిల్లా కలెక్టర్‌గా రావడం జిల్లా ప్రజలు చేసుకున్న అదృష్ట మన్నారు. కలెక్టర్ శివ శంకర్ లోతేటి మాట్లాడుతూ జిల్లా పట్ల నాకు సంపూర్ణమైన అవగాహన లేకపోవడంతో మాతృభాష దినోత్సవం నాకు వచ్చిన సమాచారం మేరకు నిర్వహించామన్నారు. భవిష్యత్తులో సాహిత్యం కళలు మన సంస్కృతి మన సాంప్రదాయం మన మాతృభాష పట్ల అవగాహనతో నెలనెలా సాహిత్యం వెన్నెల అను కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. ఈ సందర్భంగా గానుగపెంట హనుమంతరావు కలెక్టర్ ను ఆశీర్వదిస్తూ కుడి చేతికి ఆంజనేయ యంత్ర రక్షాబంధనాన్ని కట్టారు వైయస్సార్ జిల్లా కేంద్రమైన కడపలో తెలుగు తల్లి విగ్రహాన్ని ప్రతిష్టించాలని హనుమంతరావు కోరారు అందుకు కలెక్టర్ అంగీకరించారు తన జన్మదినానికి సెప్టెంబర్ 16 రావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గిడుగు రామ్మూర్తి పంతులు జాతీయ అవార్డు గ్రహీత రవి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఫిర్యాదుల పరిష్కారానికి గట్టి చర్యలు

**- ఫిర్యాదుదారుల సేవలే లక్ష్యంగా పనిచేయాలి**
**- విద్యుత్ శాఖ ఎస్ఈఎస్ రమణ**



చెన్నూరు - సూర్యవాస్తవం: క్షేత్రస్థాయిలో వినియోగదారుల నుండి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా విద్యుత్ కు సంబంధించిన అన్ని సేవలను ప్రజలకు అందించేందుకు సిబ్బంది పనిచేయాలని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్ రమణ అన్నారు. శుక్రవారం చెన్నూరు 33/11 కెవి సబ్ స్టేషన్, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లను వద్దకు వెళ్లి అక్కడ ఉన్న వాటిని పరిశీలించి విద్యుత్ సిబ్బందికి తగు సూచనలు సలహాలను ఇవ్వడం జరిగింది. అనంతరం ఆయన చెన్నూరు మండల అధికారులు సిబ్బందితో చెన్నూరు విద్యుత్ కార్యాలయంలో సమావేశమై పలు విషయాలపై వారికి అవగాహన కల్పించారు. ప్రజలకు ఫిర్యాదుల్లని సేవలే లక్ష్యంగా తామంతా పనిచేయాలని తెలిపారు. అలాగే ఒక్క యూనిట్ విద్యుత్ కూడా వృధా కాకుండా చూడాల్సిన బాధ్యత మీపై ఉందని ఆయన వారికి సూచించారు. వినియోగదారులు సంస్థ ద్వారా సర్వీస్ పొంది మీటర్ ద్వారానే విద్యుత్ వినియోగించేల చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంతేకాకుండా విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలని వాలిపోయిన స్తంభాలను, లూజు లైన్లను ఎప్పటికప్పుడు సరిచేయాలని వారిని ఆదేశించారు. తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన తగు చర్యలు తీసు కోవాలని వారికి తెలియజేశారు. వినాయక చవితి సందర్భంగా పందిళ్ల వద్ద విద్యుత్తు భద్రతా నియమాలు విధిగా పాటించే విధంగా ఆర్గనైజర్లతో సమావేశాలు ఏర్పరచుకొని ఎటువంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ సంస్థ నెలరోజుల ముందు విద్యుత్ కొనుగోలు చేసి వినియోగ దారులకు ఇస్తుందని, విద్యుత్ బకాయిల వసూళ్లలో రాజీ పడవద్దని ఎప్పటికప్పుడు



విద్యుత్ బకాయిలు వసూలుపై దృష్టి సారించాలని వారికి తెలియజేశారు. విద్యుత్ ప్రమాదాలపై అప్ర మత్తంగా ఉంటూనే విద్యుత్ ప్రమాదాల నివారనే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఆయన విద్యుత్ అధికారులకు సిబ్బందికి తెలియజేశారు. అంతే కాకుండా విద్యుత్ పొదుపు ప్రమాదాల నివారణ వంటి వాటిపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతులు చేయాలని ఆయన తెలిపారు. అంతరాయాలు ఎక్కువ అధికంగా ఉన్నచోట అక్కడ ఉన్న లైన్ల లో సమస్యలను గుర్తించి ముందస్తు మరమ్మత్తులు చేసి అంతరాయలను అరికట్టి నిరంతర నాణ్యమైన విద్యుత్ ను ప్రజలకు అందించాలని అధికారులకు తెలియజేశారు. విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉంటు, విద్యుత్ ప్రమాదాల నివారణ లక్ష్యంగా అధికారులు సిబ్బంది పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన తెలిపారు. విద్యుత్ సిబ్బంది వినియోగదారులతొ మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ వారి విద్యుత్ సమస్యలను సావధానంగా విని పరిష్కరించి సంస్థపై ప్రజలలో సంతృప్తికరస్తాయిని పెంచాలని తెలియజేశారు. అలాగే విధుల్లో అలసత్వం వహించే వారిపై శాఖపరమైన చర్యలు తప్పవని గట్టిగా అధికారులను సిబ్బందిని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో కడప డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ఇంజనీర్ రామలింగారెడ్డి, జూనియర్ ఇంజనీర్లు స్రవంతి, లావణ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఉచిత ఇసుక పాలసీని పారదర్శకంగా అమలు చేయాలి

**- లాభాపేక్ష లేకుండా వినియోగదారులకు ఇసుక సరఫరా చేయాలి**
**- ఇసుకను ఉచితంగా ప్రజలకు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం**
**- రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**





అన్నమయ్య - సూర్యవాస్తవం: జిల్లాలో ఉచిత ఇసుక పాలసీని పారదర్శకంగా అమలు చేయాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఇసుక రీచ్ నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి రాజం పేట మండలం, బాలరాజు పల్లెలో ఇసుక రీచ్‌ను ప్రారం భించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ ప్రభుత్వానికి ఎటువంటి లాభాపేక్ష లేకుండా కేవలం నిర్వహణ చార్జీలు వసూలుతో వినియోగ దారులకు డిపోల ద్వారా ఇసుకను సరఫరా చేయడం జరుగు తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఉచిత ఇసుక విధానం తీసుకొచ్చిన ఘనత ఒక మన ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. ఇసుక నిర్వాహకులు లాభాపేక్ష లేకుండా వినియోగదారులకు ఇసుక సరఫరా చేయాలని ఇసుక సరఫరాలో ఎటువంటి సమస్యలు తలెత్తకూడదన్నారు. ఇసుకను ఉచితంగా ప్రజలకు అందించ డమే ధ్యేయంగా ప్రభుత్వం ముం దుకు వెళు తుందని ప్రజలందరూ ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఉచిత ఇసుక విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకల వల్ల ప్రస్తుతం ఇప్పుడు ఇసుక లభించక ఎంతో ఇబ్బంది పడుతు న్నప్పటికీ అన్ని రంగాలకు సమృద్ధిగా ఇసుక సరఫరా చేసేందుకు ప్రభుత్వం విశేష కృషి చేస్తానన్నారు. ఆర్థికంగ ఎన్నో ఇబ్బందులు ఉన్నప్పటికీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇంత గొప్ప సాహసోపేతమైన నిర్ణయం తీసుకు న్నందుకు ప్రతి ఒక్కరు ఆయనకు కృతజ్ఞతలు తెలపాలన్నారు.

# వాడవాడలో కొలువుదీరనున్న గణనాథులు..!

**- నేటి నుంచి వినాయక చవితి ఉత్సవాలు**



దువ్వూరు- సూర్యవాస్తవం : వాడవాడలలో కొలువు తీరినున్న గణనాథుడు. అన్ని గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరపడానికి ఉత్సవ కమిటీలు ఏర్పడ్డాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొని వినాయకుడు కొలువు తీయడానికి సిద్ధమయ్యారు. విఘ్నాలను తొలగించే వినాయక చవితి రానే వచ్చింది. గణాలకు అదిపతైన గణపతి నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవడానికి మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా భక్తులు సిద్ధమయ్యారు. ఏటా భాద్రపద శుద్ధ చవితి రోజున వినాయక చవితి జరుపుకుంటారు. హిందూ సంప్రదాయం ప్రకారం గణపతి దేవుని మొదటిగా పూజ చేసి ఆరాధించడం ఆనవాయి తీగా వస్తోంది. దేవతలు ఋషుల కాలం నుంచి ఏ కార్యక్రమమైన గణపతి పూజతో ప్రారంభిస్తారు. రాగి మట్టితో వినాయక విగ్రహాలను తయారుచేసి చవితి రోజున ప్రకృతి సిద్ధమైన పత్రి ఆకులతో అష్టోత్తర శతనామాలతో గణపతి పూజలకు నిర్వహిస్తారు. వినాయకుడి వివిధ రకాల పదార్థాలతో పాయాసాలతో పప్పు, కుడుములతో నైవేద్యాలను సమర్పించి గణపతి పూజలు నిర్వహిస్తుంటారు. ఏడాది మొత్తంలో ప్రముఖ ఏలాంటి విఘ్నాలు కలగకుండా సర్వదేవతలకు పూజలు అందే విధంగా గణనాథుడికి పూజలు నిర్వహిస్తే సర్వదేవతలకు నిర్వహించినట్లు గా భావించి పూజలు చేస్తారు. దువ్వూరు మండలంలోని అన్ని గ్రామా లలో గణపతి ఉత్సవాలు నిర్వహించేందుకు భక్తులు సిద్ధమయ్యారు. వాడవాడలా గణపతి విగ్రహాలను మండపాలలో ప్రతిష్టించేందుకు గణేష్ ఉత్సవ కమిటీలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి. కళ్ళు జిగేల్ మనిపించేలా శోభయామనంగా విద్యుత్ వెలుగుల్లో నవరాత్రి వేడుకలు ఉత్సవ కమిటీలు నిర్వహించ నున్నారు. సంబరాలు అంబరాన్ని అంటు తాయి. ప్రత్యేక మండపాలను ఏర్పాటు చేసి వివిధ రకాల వినాయకులను ప్రతిష్టించి పూజిస్తారు. శుక్రవారం అన్ని ప్రాంతాల్లో వినాయక శోభ మార్కెట్ రద్దీగా మారింది. పూజ ఫలాలు తిను బండారాలు, కొను క్కుంటూ ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో వినాయకుడిని పూజిస్తారు. ఊరూరా, పట్టణాల్లో ప్రతి వీధిలో వినాయక విగ్రహాలను అత్యంత అలంకరణంగా ప్రతిష్ఠించి పూజించనున్నారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో వినాయకుడు కొలువు తీరనున్నారు.

# ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీ, ఎమ్మెల్యే

- ఉపాధ్యాయుల రిజిస్టర్, విద్యార్థుల హాజరు పరిశీలన
- అన్నం ముద్ద ముద్దగా ఉండటంపై ఆగ్రహం
- పాఠశాలను 10వ తరగతి వరకు అప్ గ్రేడ్ చేయిస్తామని హామీ



అనంతపురం - సూర్యవాస్తవం: అనంతపురం నగరంలోని చంద్రబాబు నగర్ లో ఉన్న ప్రభుత్వ పాఠశాలను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మి నారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం ఆకస్మి కంగా పాఠశాలకు రావడంతో ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది అప్రమత్త మయ్యారు. ముందుగా ఉపాధ్యాయుల రిజిస్టర్‌ను పరిశీంచారు. ఆ తర్వాత విద్యార్థుల హాజరు శాతం ఎంత ఉందన్నది చూశారు. ఆ తర్వాత మధ్యాహ్న భోజనాన్ని వారు పరిశీలించారు. అన్నం ముద్ద ముద్దగా ఉండటాన్ని గమనించి.. ఎమ్మెల్యే ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి భోజనం విద్యార్థులు ఎలా తింటారని ప్రశ్నించారు. వెంటనే ఏజెన్సీ వారితో మాట్లాడి.. పాఠశాలకు నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని ఆదేశించారు. మరోవైపు పాఠశాలలో డ్రాప్ అవుట్స్ ఉండటాన్ని గమనించారు. మైనార్టీలు ఎక్కువగా ఈ ప్రాంతంలో ఉండటంతో.. 8వ తరగతి తర్వాత చదువు మానేస్తున్నారని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వెంటనే స్పందిస్తూ.. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి పాఠశాలను 10వ తరగతి వరకు అప్ గ్రేడ్ చేయిస్తామన్నారు. వచ్చే ఏడాది నుంచి పాఠశాల 10వ తరగతి వరకు ఉంటుందని ఎమ్మెల్యే దగ్గుపాటి హామీ ఇచ్చారు.

# వరద బాధితులకు విరాళం అందించడం అభినందనీయం



అనంతపురం -సూర్యవాస్తవం: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు విరాళం అందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. పెద్దపప్పూరులోని శ్రీ సాయిరాం ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థుల ద్వారా విజయవాడ వరద బాధితులకోసం విరాళాలు వసూలు చేయగా, వసూలు చేసిన రోయి.30,159ను శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో కరస్పాండెంట్ మదన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఆ మొత్తాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌కు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ విజయ వాడ వరద బాధితులను ఆదుకునేందుకు విరాళం అందించడం ఎంతో గొప్ప విషయమన్నారు. పాఠశాలలోని విద్యార్థుల ద్వారా వసూలు చేయబడిన ఈ మొత్తాన్ని విద్యార్థులే స్వయంగా చేశారని శ్రీ సాయిరాం ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాం డెంట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయిరాం ఇంగ్లీష్ మీడియం పాఠశాల హెచ్ఎం మల్లీశ్వరి, ఇన్చార్జిలు రామాంజినేయులు, గిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పర్యావరణహితంగా వినాయక చవితి జరుపుకోవాలి

**- అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మి నారాయణ, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**



అనంతపురం -సూర్యవాస్తవం: పర్యావరణహితంగా వినాయక చవితి జరుపుకోవాలని ఎంపీ అంబికా లక్ష్మి నారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నగరంలోని నగర పాలక సంస్థ కార్యాలయం ముందు కాలుష్య నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మి నారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.మట్టి విగ్రహాన్ని కుండీలో నిమజ్జనం చేస్తే..అందులో తులసి మొక్కలు వస్తుందని, దీని ద్వారా నిత్యం ఆ మొక్కను పూజించుకోవచ్చన్నారు. పొల్యూ షన్ బోర్డు చేసిన వినూత్న ప్రయోగంపై ఎమ్మెల్యే, ఎంపీ ప్రసం శలు కురిపించారు. ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాలను ఎవరూ పూజించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిషోర్ రెడ్డి, నగర పాలక సంస్థ అడిషినల్ కమిషనర్ శ్రీహరి పాల్గొన్నారు.

# మహిళలకు ఉచిత బ్యూటిషన్ శిక్షణ

**- కార్యక్రమాన్ని ప్రారంభించిన గుమ్మనూరు ఈశ్వర్**



పామిడి - సూర్యవాస్తవం : అనంతపురం జిల్లాగుంతకల్లు నియో జకవర్గ శాసనసభ్యులైన గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ పామిడి పట్టణంలోని అంబేత్కర్ భవనంలో మహిళలకి బ్యూటిషియన్ మరియు టైలరింగ్ శిక్షణ ఐసిడిస్ ఆధ్వర్యంలో శ్రీమంతం కార్యక్రమన్ని ప్రారంభిం చారు. ఈశ్వర్ మాట్లాడుతూ పామిడి మండలంలో ఈ కార్యక్రమాన్ని చేస్తు న్నందుకు చాలా సంతోషపడుతున్నాను అదేవిధంగా మహిళలకి సంబంధించి వాళ్ళకంటూ ఈ బృటిషియన్ వారికి, అంగన్వాడీ మహిళలకూ వారు చేసే సేవ గురించి చాలా క్లుప్తంగా వర్ణించారు. అలాగే ఐసీడీస్ వారికి గవర్నమెంట్ తరుపున తెలుగుదేశం పార్టీ తరపున కొన్ని స్థలాలు కేటాయిస్తం అని హామీ ఇచ్చారు.ఈ కార్యకారమంలో తెలుగుదేశం బొల్లు శ్రీనివాస్ రెడ్డి, ఆర్. ఆర్.రమేష్, గౌస్ పేరా, కత్రిమల ప్రభాకర్, సంజీవ కుమార్, కార్యకర్తలు, కూటమి సభ్యులు పాల్గొన్నారు.

# తల్లితో సహా ఇద్దరి పిల్లల ప్రాణాలను కాపాడిన పోలీసులు



హిందూపురంటౌన్- సూర్యవాస్తవం: హిందూపురం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సూరప్ప కట్ట కింద అంబేద్కర్ నగర్‌లో నివాసం ఉన్న చైత్ర అనే మహిళ తన ఇద్దరు బిడ్డలతో కలిసి ఎంజీఎం స్కూలు గ్రౌండ్ సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్ పై ఆత్మ హత్య చేసుకోవాలని వెళ్ళగా అక్కడ కొంత మంది గమనించి 100 డయల్ సమాచారం ఇచ్చారు. వెంటనే హిందూపురం టూ టౌన్ పోలీస్ వారు వెంటనే అక్కడికి వెళ్లి వారిని రక్షించారు.

# ఘనంగా మోక్షజ్ఞ పుట్టినరోజు వేడుకలు



హిందూపురంటౌన్ - సూర్యవాస్తవం: హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ పుట్టినరోజు సందర్భంగా ఆర్ఎంఎస్ షఫీఉల్లా ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సర్కిల్లో కేక్ కట్ చేసి పాలు బ్రెడ్ పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షఫీ ఉల్లా, పట్టణ అధ్యక్షులు డిఇ రమేష్, జిల్లా అధ్యక్షులు ఆంజనప్ప, అమర్నాథ్, మాజీ సర్పంచ్ రాము, రమణ, ఐటీడీపి నజీర్ అహమద్, శ్రీనివాస నాయుడు, కెఎం బాషా, కౌన్సిలర్ల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంజీవరెడ్డి పల్లెలో చోరీ..!

**- మూడు తులాలు బంగారు**

**- ఐదు తులాల వెండి - 6వేలు నగదు చోరీ**



దువ్వూరు- సూర్యవాస్తవం : మండల పరిధిలోని సంజీవరెడ్డిపల్లె గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున సమయంలో మారెళ్ళ రామ సుబ్బారెడ్డి ఇంట్లో చోరీ జరిగిందని పోలీసులు తెలిపారు. మూడు తులాలు బంగారు, ఐదు తులాలు వెండి,6 వేల రూపాయల నగదు దొంగలు అపహరించారన్నారు. శుక్రవారం రామసుబ్బారెడ్డి పోలీసులకు ఫిర్యాదు లో దొంగలు తన ఇంటిలో ఒక నల్లపూసల దండ, చెంప సవరాలు, కమ్మలు, రెండు జతల వెండి గొలుసులు, ఆరు వేల రూపాయల నగదు దొంగలు దొంగలించినట్లు ఫిర్యాదు చేశారు. అదే గ్రామంలో మరో రెండు చోట్ల చోరీకి ప్రయత్నం చేసి విఫలమైనట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ యాదవ్, ఏఎస్ఐ రామ్మూర్తి, క్లూస్ టీం తో సంజీవరెడ్డిపల్లె గ్రామంలో చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. అన్ని కలిపి రూ.1,68,000ల విలువగల వస్తువులను దొంగలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# చౌక దుకాణాలను ప్రారంభించిన గుమ్మనూరు ఈశ్వర్



పామిడి రూరల- సూర్యవాస్తవం : గుంతకల్లు నియోజకవర్గం పామిడి మండలంలో శుక్రవారం గుంతకల్లు నియోజకవర్గ శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ పామిడి మండలం పళ్యం అప్పాజీపేట గ్రామంలోని చౌక దుకాణాలను ఈశ్వర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు మాజీ ఎంపీపీ నారాయణస్వామి కత్రిమల ప్రభాకర్ మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులు, బీజేపీ, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొట్టుకున్న మామ అల్లుడు



మదనపల్లె క్రైమ్ -సూర్యవాస్తవం : మామా అల్లుడు ఒకరిపై మకరు దాడులు చేసుకుని కొట్టుకున్న సంఘటన శుక్రవారం కుర్బల్ కోట మండలంలో వెలుగు చూసింది. ముదివేడు పోలీసుల కథనం మేరకు.. కుబలకోట మండలం, ఎర్రమద్దివారి పల్లెకు చెందిన సుదర్శనరెడ్డికి అదేఊరికి చెందిన జయపాల్ రెడ్డి తన కూతురు ఈశ్వరమ్మ ని ఇచ్చి రెండేళ్ల క్రితం పెళ్లి చేశాడు. వినాయకచవితి సందర్భంగా తన కూతురికి గురువారం రాత్రి కొత్తచీర ఇవ్వాలని కూతురి ఇంటికి వెళ్లగా అల్లుడు ఇంట్లోకి రావద్దని అడ్డుకున్నాడు. దీంతో మామ అల్లుడు గొడవ పడి కొట్టు కున్నారు. వినాయకుని పండుగకు కూతురికి కొత్త చీర తీసుకెళ్లిన మామను ఇంట్లోకి రాకుండా అల్లుడు అడ్డుకున్నాడు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య మాట మాట పెరిగి అల్లుడుపై మామ కర్రతో దాడిచేసి గాయ పరిచగా ప్రతి దాడిలో మామ సైతం గాయపడ్డాడు.. గాయపడ్డ ఇద్దరిని కుటుంబీకులు మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

# భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్యాయత్నం



మదనపల్లె క్రైమ్- సూర్యవాస్తవం : భార్య కాపురానికి రాలేదని భర్త ఉరి వేసుకునే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మదనపల్లి మండలంలో శుక్రవారం జరిగిన ఘటనపై తాలూకా ఎస్సై రమణ తెలిపిన వివరాలు ఎలా ఉన్నాయి. మండలం లోని బసినికొండలో కాపురం ఉంటున్న ఎస్. మహమ్మద్ (23) వలసపల్లెకు చెందిన షబ్రీన్ తాజ్‌ను పెళ్లి చేసుకున్నాడు. ఆమె అత్తగారింట్లో ఉండడం లేదని పెద్దల సలహా మేరకు స్థానికంగా ఉన్న అద్దె ఇంటిలో ఇటీవల వేరు కాపురం పెట్టాడు. నెల రోజులు గడిపిన తర్వాత ఆమె పుట్టింటికి వెళ్లి కాపురానికి రానని చెప్పింది. దీంతో అతను తీవ్ర మనస్తపం చెంది జీవితంపై విరక్తి చెందాడు. తన ఉంటున్న అదే ఇంటికి చేరుకుని ఇంట్లోనే ఉరే సుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి జిల్లా ఆసుపత్రికి తరలించగా, ఆస్పత్రి అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి మెరుగైన వైద్యం అందించారు. అయినా ఆరోగ్యం కుదుటపడకపోవడంతో మెరుగైన వైద్యం కోసం అతన్ని బెంగళూరుకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు.

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



## బుడమేరు గండ్లు పూడ్చకపోవడమే ఈ వరదకు కారణం జగన్

**- కడప జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పి.మునిశేఖర్ రెడ్డి**



మైదుకూరు- సూర్యవాస్తవం: కడప జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పి.ముని శేఖర్ రెడ్డి మైదుకూరు నియోజకవర్గం లోని చాపాడు మండలంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నాటి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలన వల్లనే విజయవాడ నగరానికి వరద ముప్పు వచ్చింది గతంలో ఐదు సంవత్సరాల కాల పరిపాలనను గాలికి వదిలేసి రాష్ట్రంలో పరిపాలన ఎలా జరుగుతుందని తెలుసుకోకుండా నాడు వైసిపి నాయకులు చేసిన నిర్వా హాం ఏమిటంటే ! పోలవరం కాలువ కట్టమట్టిని కూడా ఈ వైసీపీ పెద్ద మనుషులు దోచుకోవడం వలన నేడు విజయవాడకు వరద ముప్పు వచ్చింది. కాలువ మట్టి ఎత్తకుండా ఉంటే నీరు కృష్ణా నదిలోకి వెళ్ళేది. బుడమేరు ప్రాజెక్టుకు కూడా గత పాలనలోనే గండ్లు పడిన పట్టించుకోనే నాదుడే లేరు. మీరు చేసిన తప్పులే ఈ వరదకు కారణం. బాధితులను పరామర్శించడానికి పోయి మీరు ఇప్పుడు కూడా మీ పత్రికలలో అమరావతి మునిగిపోతుంది ఉండవల్లిలో సీఎం గారి ఇల్లు మునిగిపోయింది అనే తప్పుడు ప్రచారం తప్ప, బాధితులకు అండగా ఉందామనే ఆలోచన లేదు. ఇకనైనా మీ ప్రవర్తనను మార్చుకొని బాధితులకు సాయం చేయండి.

## ఎస్సార్ఐటీలో గెస్ట్ లెక్చర్




ప్రొద్దుటూరు-సూర్యవాస్తవం: స్థానిక సాయి రాజేశ్వరీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఎన్ఐటీ తిరుచినా పల్లి ఈసిఈ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.చంద్రబాబు నాయక్ చే చాలెంజెస్ అండ్ ఇనోవేషన్ ఆఫ్ ఫిజికల్ డిజైన్ ఇన్ విఎల్ఎస్ఐ టెక్నాలజీ అనే అంశం పైన ఈసిఈ విద్యార్థులకు గెస్ట్ వెక్చర్ నిర్వహించారు. ప్రిన్సిపల్ డా.పాండురంగన్ రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్య క్రమంలో చంద్రబాబు నాయక్ విద్యార్థులకు ఫండమెంటల్ ఆఫ్ విఎల్ఎస్ఐ గురించి వివరించారు. ఈ టెక్నాలజీ వలన బిటెక్, ఎంటెక్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, భవిష్యత్ కాలాలనికి వియల్ఎస్ఐ డిజైన్ లో ఉన్న ఛాలెంజెస్ గురించి వివరంగా తెలిపారు. అనంతరం ఈసిఈ హెచ్ఓడి డాక్టర్ శివ మాట్లాడుతూ ఈసిఈ విద్యార్థులు కోర్ జాబ్స్ మీద ఆధారపడి, దానికి సంబం ధించిన విఎల్ఎస్ఐలో జాబ్స్ సులభంగా పొందడానికి స్థిరంగా ఉండడానికి ఈ గెస్ట్ లెక్చర్ దోహదపడుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్ బసిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్ రెడ్డి, కరస్పాండెంట్ వీరకల్యాణ్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్సార్ఐటీలో మొక్కల పెంపకం



ప్రొద్దుటూరు-సూర్యవాస్తవం: స్థానిక సాయి రాజేశ్వరీ ఇన్సిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాల క్యాంపస్ లో ఎన్ఎస్ఎస్ యునిట్ అధ్వర్యంలో శుక్రవారం ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంనకు ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ డాక్టర్ పాండురంగన్ రవి, గౌరవ అతిథిగా కరస్పాడెంట్ బసిరెడ్డి వీరకళ్యాణ్ రెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. క్యాంపస్‌ను పచ్చగా మార్చడం, గాలి నాణ్యతను మెరుగు పరచడం, పరిసరాల అందాన్ని మెరుగు పరచడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అని వారన్నారు. మొక్కలు పెంచడం మన అందరి బాధ్యత అని తెలిపారు. ప్లాంటేషన్‌లో ఛైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్ రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు, హెచ్ఓడిలు, పాల్గొన్నారు.

## వికాస్ విహార్‌లో మోక్షజ్ఞ తేజ జన్మదిన వేడుకలు



ప్రొద్దుటూరు - సూర్యవాస్తవం: నందమూరి బాలకృష్ణ తన యుడు నందమూరి మోక్షజ్ఞ జన్మదిన సందర్భంగా శుక్ర వారం వికాస్ విహార్ మానసిక వికలాంగుల విద్యాల యంలో అన్నదానం, కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వ హించారు.ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ యస్‌యం.షరీఫ్, పట్టణ మైనార్టీ అధ్యక్షులు భాష, టౌన్ వైడ్ ఎన్.బి.కె అండ్ మోక్షజ్ఞ ఫ్యాన్స్ గౌరవాధ్యక్షులు రాంప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ యస్. యువరాజు, సెక్రటరీ టీ.రమేష్ బాబు, జాయింట్ సెక్రెటరీ చంద్రశేఖర్ యాదవ్, ముస్కిన్ వల్లి, సత్యం, రాము డు, యస్.రఫీ, ఓబుల్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, చంగా వెంకట సుబ్బయ్య, భాస్కర్, నందమూరి అభిమానులు పాల్గొన్నారు.

# పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబాలు

**- జిల్లా ప్రజలకు 'వినాయక చవితి శుభాకాంక్షలు**
**- కలెక్టర్ శివశంకర్ లోతేటి**



కడప బ్యూరో - సూర్యవాస్తవం: రాష్ట్ర ప్రభుత్వ సుపరి పాలనలో ప్రజలకు సంక్షేమ ఫలాలు సంతృప్తస్థాయిలో అందాలని, జిల్లా ప్రజలకు పరిపూర్ణమైన ఆయురా రోగ్యాలు సిద్ధించాలని కోరుకుంటూ ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, ప్రజాప్రతినిధులు ఆకాంక్షించారు. రేపు "వినాయక చవితి" పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు తమ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగలు, వేడుకలు మన సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతిబింబాలు అని ఈ వినాయక చవితి పర్వదినం ప్రతి ఒక్కరికీ విఘ్నాలను తొలగించి సంతోషాన్ని, ఆనందాన్ని అందించాలని ఆయన ఆకాంక్షించారు. వినాయక చవితి సంధర్భంగా ఆ మహాగణపతి ఆశీస్సులతో ప్రతీ ఇల్లు సంక్షేమ, సౌభాగ్యాలతో శోభాయమానంగా వెలుగొందాల న్నారు. పల్లెసీమలు పశుసంపద, వ్యవసాయ, ఉద్యాన పంటలతో సుభిక్షంగా కలకళలాడాలని ఆకాంక్షిస్తూ కలెక్టర్ శివశంకర్ లోతేటి తో పాటు ఎస్.పి. హర్షవర్ధన్ రాజు, జేసి అదితి సింగ్, ఎంపీలు, జిల్లాలోని ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఆ ప్రకటనలో జిల్లా ప్రజలందరికీ "వినాయక చవితి" శుభాకాంక్షలు తెలియజేశారు. ఆ గణపతి ఆశీస్సులతో ప్రజ లంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, అందరి భాగస్వామ్యంతో అభివృద్ధిలో జిల్లాను ముందంజలో నిలపాలని ఈ సందర్భంగా వారు అభిల షించారు. జాగ్రత్తలు పాటిస్తూ.. ఆనందోత్సా హాలతో గణపతి ఉత్సవాలను నిర్వహించుకోవాలని వారు ఆ ప్రకటన లో కోరారు.

## మట్టి వినాయకులనే పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

**- వృక్ష శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ పివి కృష్ణారెడ్డి**



మైదుకూరు - సూర్యవాస్తవం: ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదుకూరులో ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణ రెడ్డి అధ్యక్షతన వృక్ష శాస్త్ర విభాగ ఆధ్వర్యంలో మట్టి వినాయకుని పూజిద్దాం పర్యావరణ పరిరక్షణలో పాల్గొందాం, పూజలో వినియోగించే 21 పత్రాల విశిష్టత అనే కార్యక్ర మాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి నారాయణ రెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి స్వాతంత్ర ఉద్యమంలో బాలగంగాధర్ తిలక్ అంటే జాతీయ నాయకులు ప్రజలను ఏకతాటి కి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించింది అని, పండుగను ముఖ్యంగా చెరువులలో గల మట్టిని పూడికలను తీయడం ద్వారా వచ్చిన మట్టి ద్వారా తయారైన మట్టి విగ్రహాలను తయారు చేయటం ఆచారం, కానీ ప్రస్తుతం ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారైన భారీ విగ్రహాలను ప్రతి వీధిలో విగ్రహాలను ఏర్పాటు చేయటం పర్యావరణానికి మంచిది కాదు అని తెలియ జేశారు. ప్రతి గ్రామంలోని దేవాలయంలో మట్టి విగ్రహా లను ఉపయోగించటం ద్వారా గ్రామంలోని ప్రజలు, వారి సమస్యలను కానీ, గ్రామ అభివృద్ధి కానీ కమిటీలను సమా వేశాలను జరిపే అవకాశం వస్తుంది కనుక వీలున్నంత వరకు విగ్రహాల సంఖ్యను తగ్గించాలి అని, అలాగే అనవ సరపు ఆర్భా టాలకు పోకుండా భక్తిశ్రద్ధలతో పండగను సాంప్రదా యబద్ధంగా జరుపుకోవాలని సూచించారు. తదనంతరం వృక్ష శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ పి వి కృష్ణారెడ్డి మాట్లాడుతూ మట్టి విగ్రహాలని ఎందుకు పూజించాలో అందులో గల వైశిష్టత ఏమిటో పర్యా వరణానికి ఎలా మేలు చేస్తుందో, ముఖ్యంగా వివిధ రకాల రంగు లను వాడటం ద్వారా చెరువులలో నిమజ్జనం చేసిన సమయంలో నీరు కలుషితమై జలచరాలకి, మొక్కలకి హాని చేస్తుంది కనుక, జల వనరులను సంరక్షించ వలసిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని తెలియజేశారు, అలాగే వినాయక పూజలో విని యోగించే మాచిపత్రి, బృహతీ బిల్వ, దూర్వా, గరిక ఉమ్మెత్త, రేగు, ఉత్తరేణి, తులసి, మామి డి, గన్నేరు, విష్ణు క్రాంతి, దానిమ్మ, దేవదారు, మరువము, వావిలి, జాజి, దేవ కాంచనం, జమ్మి, రావి,తెల్ల మద్ది జిల్లేడు పత్రాల విశిష్టతను ఔషధ విలువలను తెలియజేశారు. చివరిగా కళాశాలలో ఉన్నటువంటి అధ్యాపకులు, విద్యార్థులు తప్పనిసరిగా మట్టి విగ్రహాలనే వినియో గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సి.నరసింహారావు, అయ్యవారు రెడ్డి, చెన్న రాయుడు, శ్రీనివాసులు తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మట్టి గణపతి విగ్రహాల పంపిణీ



ప్రొద్దుటూరు - సూర్యవాస్తవం: స్థానిక మైదుకూరు రోడ్డు లోని సిఎంఆర్ షాపింగ్ మాల్ మేనేజ్మెంట్ వారు, ప్రొద్దుటూరు మున్సిపాలిటీ వారు సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం శుక్ర వారం మాల్ ఆవరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న మున్సిపల్ డిఈ దస్తగిరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాన్ని పూజించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ పండుగను ఆనందోత్సాహాలతో నిర్వహించు కోవాలని, అందులో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కలిగిన విగ్రహాలను పూజించి, వాటి ద్వారా నీటి కాలుష్యాన్ని కలిగించకుండా, కేవలం పర్యావరణ హితమైన మట్టి వినాయక విగ్రహాలను పూజించాలనే ఉద్దేశ్యంతో సిఎంఆర్ షాపింగ్ మాల్ వారు ముందుకు వచ్చి దాదాపు 6000 మందికి ఈ ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ నిర్వహిం చడం, ఈ కార్య క్రమంలో మన పురపాలక సంఘాన్ని భాగస్వామ్యం చేయ డం ఆనందకరమన్నారు. మట్టి గణపయ్యను పూజించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ శ్రీధర్, సిఎంఆర్ షాపింగ్ మాల్ సిబ్బంది పాల్గొన్నారు.



## చెకుముకి గోడపత్రాల ఆవిష్కరణ

సిద్దవటం- సూర్యవాస్తవం: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడానికి జనవిజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ ప్రతిభా పరీక్షలను ప్రతి సంవత్సరం నిర్వ హించడం ప్రశంసనీయమని సిద్ధవటం మండల విద్యాశాఖ అధికారి విలియం రాజు అన్నారు. శుక్రవారం ఆయన జెవివి మండల శాఖ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాల గోడపత్రికను ఆవిష్కరించారు. జన విజ్ఞాన వేదిక విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుటకు చెకుముకి సైన్సు సంబరాలను ప్రతి సంవత్సరం ప్రభుత్వ సహకారంతో, అనుమతితో 8,9,10 తరగతుల విద్యార్థులకు నిర్వహిస్తుందన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి సమీర్ బాష మాట్లా డుతూ ఈ పరీక్షలు పాఠశాల స్థాయిలో సెప్టెంబర్ 25న, మండల స్థాయిలో అక్టోబర్ 1న, జిల్లా స్థాయిలో అక్టోబర్ 27న రాష్ట్రస్థాయిలో నవంబర్ 9, 10 వ తేదీలలో నిర్వహిస్తామని తెలిపారు. తెలుగు, ఇంగ్లీషు రెండు భాషల్లో ఈ పరీక్షలు ఉంటాయి. కావున మండలంలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరె స్పాండెంట్లు, సైన్సు ఉపాధ్యా యులు ఎక్కువ సంఖ్యలో విద్యార్థుల చేత పరీక్షలు రాయించి చెకుముకి సైన్సు సంబరాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ విలియం రాజు, ఎంఈఓ -2 అరుణ మేడం, జన విజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి సమీర్ బాష, షేక్ మౌలాలి, గౌతమి, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

## 50 మహాగణపతి మట్టి ప్రతిమలు పంపిణీ



ప్రొద్దుటూరు-సూర్యవాస్తవం: స్థానిక బుడగ జంగం కాలనీ లోని వాసులకు నందమూరి బాలకృష్ణ సినీ ప్రస్థానంలో యాభై సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా, వినాయక చవితిని పురష్కరించుకుని శుక్రవారం యాభై మహాగణపతి మట్టి ప్రతిమలను, అలాగే నందమూరి బాలకృష్ణ తనయుడు నందమూరి తారకరామ మోక్ష తేజ జన్మదినం సందర్భంగా భారీ కేక్ కట్ చేసి అభిమాను లందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నందమూరి యువ సేవాసమితి అధ్యక్షుడు గోమేధికమ్ సుదర్శన్, ఉపాధ్య క్షుడు సిజె.లవెంకట సుబ్బయ్య, కడప పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ యస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి యమ్.మల్లికార్జున, కడప పార్లమెంటరీ తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి కూనపురి రామునాయుడు, సింహా శేఖర్, డా.మచ్చా నాగ భూషణం(అఖండ), సిజె.సమర, ఎస్.సురేష్, గంగుల కృష్ణచైతన్యరెడ్డి, మోతి బాలచెన్నయ్య, మోతి పెద్ద జమ్మయ్య, మోతి గోపాల్, మోతి నాగేష్, అగస్త్య వెంక టేష్, రుద్రాక్షల జమ్మయ్య, భారతకవి బాలు, మోతి మహేంద్ర, మోతి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

# భూ కబ్జాదారులను ప్రభుత్వం అరెస్టు చేయదా?

- ఉద్యోగులపై వేధింపులను ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు మానుకోవాలి
- భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ .రామానాయుడు సూటి ప్రశ్న?



**చిత్తూరు- సూర్య వాస్తవం:** గత ప్రభుత్వంలో ప్రభుత్వ వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులపై ప్రభుత్వంతో పాటు ప్రజా ప్రతినిధులు వేధింపులను మానుకోవాలన్నారు. ప్రభుత్వ భూములను, ప్రైవేటు వ్యక్తుల భూములను కబ్జా చేసిన వారిపై ప్రభుత్వం ఇంతవరకు చర్యలు ఎందుకు తీసుకోలేదు ఎందుకు అరెస్ట్ చేయలేదు అని సూటిగా ప్రశ్నించారు. అరెస్టు చేయకపోవడాన్ని చూస్తే ప్రభుత్వం పైన ప్రజలకు అనుమానం కలుగుతుందని వాపోయారు. అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రామానాయుడు సూటిగా ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అధికారులు ఉన్న ప్రభుత్వం చేస్తున్నటువంటి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రస్తుత ప్రభుత్వం అవలంబిస్తే గత వైఎస్సార్ సిపి ప్రభుత్వానికి పట్టిన గతే ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వానికి పడుతుందని దుయ్యబెట్టారు. గత ప్రభుత్వ పరిపాలనలో విసిగి చెందిన అన్ని వర్గాల ప్రజలు తెలుగుదేశం ప్రభుత్వాన్ని గెలిపిస్తే ప్రస్తుత అధికారులు ఉన్న ప్రభుత్వం తప్పు చేసిన వారిని కబ్జా చేసిన వారిని అవినీతికి పాల్పడిన వారిని వారిపై చర్యలు తీసుకోకపోగా అలాంటి వారిని ప్రోత్సహించడం ఎం తవరకు సమంజసం అన్నారు తెలుగుదేశం ప్రభుత్వం ఇప్పటికి అవినీతిపరులను ప్రోత్సహిస్తున్నా రని ప్రజలు గుసగుసలు మాట్లాడుకోవడం జరుగుతున్నదన్నారు. ప్రస్తుతం అధికారంలోకి రావడానికి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన సీనియర్లను బదిలీ చేయాలన్న ప్రజాప్రతినిధులైన ఎమ్మెల్యేలు మాటలు లేకుండా, సిఫార్సు లెటర్లు లేకుండా జాయిన్ చేసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

ఎమ్మెల్యేలు లెటర్ ఇస్తేనే జాయిన్ చేసుకోవాలా అనే ప్రభుత్వం జీవో ఎక్కడైనా విడుదల చేసి ఉందా? ఉంటే అది వెలుగులోకి తేవండి ప్రశ్నించారు. ఇలాంటి పోకడ వల్ల గత ప్రభుత్వానికి అన్ని వర్గాల ప్రజలు సరైన గుణపాఠం చెప్పారని విమర్శించారు. ఇలాంటి పొరపాట్లు లేకుండా అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం అన్ని విధాల ప్రజల మనలను పొంది ప్రజలకు మంచి పరిపాలన కొనసాగిస్తే ప్రజలు హర్షిస్తారని లేకపోతే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ వివిధ శాఖల్లో పనిచేస్తున్నటువంటి కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులపై రాజకీయ వేధింపులు పిచ్చుక పైన బ్రహ్మాస్త్రంగా ఉందన్నారు . రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ బిజెపి నాయకత్వంలో కుటుంబంలో ఉన్న మూడు రాజకీయ పార్టీ నాయకులు ఏ విధంగా డబ్బు సంపాదించాలి ఏ విధంగా దోచుకోవాలి అన్ని తపన తప్ప గతంలో గతంలో అధికారులు ఉన్న ప్రభుత్వం చేసిన తప్పిదలను భూ కబ్జాలను చర్యలు తీసుకోకపోగా అరెస్టు చేయ కపోగా వారికి అను కూలంగా వ్యవహరించ డానికి తీవ్రంగా విమర్శించారు. మదనపల్లి, తంబళ్లపల్లి, కాళహస్తి, చిత్తూరు, తిరుపతి లో జరిగిన భూ కబ్జాలను కుంభకోణాలను వెలికి తీయ డంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని దోయబెట్టారు భూ కబ్జాలపై ప్రతిరోజు ఎలక్ట్రాన్ మీడియా ప్రింట్ మీడియాలో కుంకాలుగా వార్తలు వస్తున్న చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గ చర్యని అన్నారు ప్రస్తుత అధికారులు ఉన్న ఎమ్మెల్యేలు మంత్రులు తనకు తెలియకుండా ఏ ప్రభుత్వాధికారి గాని ఎక్కడ గాని నియమించకూడదని వార్తలు వస్తున్నాయని వాపోయారు. ఇలాంటి పద్ధతులను సిపిఐ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని ప్రభుత్వం అధికారం శాశ్వతం కాదు ప్రజలకు చేసే పనులు శాశ్వతం అని అన్నారు ఇలాంటి పద్ధతులను మానుకోవాలని ప్రభుత్వానికి సిపిఐ పిలుపునిచ్చింది సమావేశంలో సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్ .నాగరాజు, జిల్లా సహాయ కార్యదర్శి టి జనార్ధన్ పాల్గొన్నారు.

## వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

- సీఐ శ్రీనివాసులు



**బంగారుపాల్యం - సూర్యవాస్తవం :** చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో మండలం లోని వినాయక చవితి జరిపే వారిని పిలిపించి శుక్రవారం సిఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమా వేశంలో సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ, వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని, లేనిపక్షంలో తగాదాలు గొడవలు పడిన వారిపై క్రిమినల్ కేసులు పెడతామని, ఎటువంటి గొడవలు పడిన అక్కడ పండగ నిర్వహిస్తున్న కమిటీదే బాధ్యతని మరొకసారి సూచించారు. వినాయక చవితి పండుగను చివరి వరకు ప్రశాంతంగా నిర్వహించాలని తెలిపారు. ఇప్పటికే ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న వారందరికీ పర్మిషన్ ఇచ్చినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో మహిళా ఏఎస్ఐ వల్లెమ్మ, హెడ్ కానిస్టేబుల్ పురుషోత్తం, కిరణ్ కుమార్, పిసి నీరజాక్షులు వినాయక చవితి పండుగ జరిపే మండలంలోని కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## చిత్తూరులో సర్వసభ్య సమావేశం



**చిత్తూరు- సూర్యా వాస్తవం :** ఉమ్మడి చిత్తూరు జిల్లా సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ సమావేశపు మందిరంలో శుక్రవారం జెడ్పి చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అధ్యక్షతన ప్రారంభం కాగా .. ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ విచ్చేయగా...వీరితో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ జి. విధ్యాధరి, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌లతో పాటు... ఎంఎల్‌సిలు భరత్, చంద్ర శేఖర్ రెడ్డి, చంద్రగిరి, పూతలపట్టు, జీడి నెల్లూరు శాసనసభ్యులు పులివర్తి నాని, డా.థామస్, మురళి మోహన్‌లు పాల్గొన్నారు. వీరితో పాటు జెడ్ పి వైస్ చైర్మన్ రమ్య, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, జెడ్ పి సి ఈ ఓ గ్లోరియా, తిరుపతి డి ఆర్ ఓ పెంచల కిషోర్, జెడ్ పి టి సి లు, ప్రత్యేక ఆహ్వానితులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా కు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సి ఎం పవన్ కళ్యాణ్ వారి సారథ్యం లో చిత్తూరు జిల్లా ను ప్రగతి పథంలో ముందుకు నడిపించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

## విఘ్నాలు తొలిగి విజయాలు చేకూరాలి

- జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ



**చిత్తూరు- సూర్యవాస్తవం:** రేపు శనివారం జరుపుకోనున్న వినాయక చవితి పర్వదినం సందర్భంగా జిల్లా ప్రజలకు ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు, శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని, అందరి జీవితాల్లో విఘ్నాలు తొలగిపోయి విజయాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. విఘ్ను శ్వరుడి ఆశీస్సులతో జిల్లాలోని ప్రతి కుటుంబం సుఖ సంతో షాలతో... అభివృద్ధిలో ముందడుగు వేయాలని అభిలషించారు. వినాయక చవితి వేడుకలు, గణేష్ నిమజ్జనం కార్యక్రమాలు ప్రశాంతంగా, ఆనందంగా నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## పర్యావరణ హితంగా వినాయక చవితిని జరుపుకుందాం



**చిత్తూరు- సూర్యవాస్తవం :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించి మట్టి వినాయక విగ్రహాలతో పూజలు చేయాలని, వినాయక చవితి పండగను ప్రజలందరూ సుఖ సంతోషాలతో చేసుకోవా లని, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విఘ్నాలను, సంకటాలను తొలగించి విజయాన్ని అందించే వినాయక చవితి పండుగ ప్రతి ఇంట వారి విఘ్నాలను తొలగించి ఆయురారోగ్యాలు సుఖ సంతోషాలతో, సిరి సంపదలతో తుల తూగాలని కోరుకుంటూ.. మట్టి గణపతిని పూజించడం ద్వారా పర్యావరణానికి మేలు చేసిన వారమవుతాని తద్వారా పర్యా వరణాన్ని కాపాడు కునేలా ప్రతి ఒక్కరూ ఈ విషయంలో భాగస్వాములు కావాలని మట్టి గణపతిని పూజిద్దాం అంటూ జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి, డిఆర్ఓ బి. పుల్లయ్య ఆ ప్రకటనలో తెలిపారు.

## మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దాం..

- నగరపాలక ఆధ్వర్యంలో విగ్రహాల పంపిణీ



**చిత్తూరు- సూర్య వాస్తవం :** వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ మట్టితో చేసిన విగ్రహాలను పూజిద్దామని నగర మేయర్ ఎస్. అముద పిలుపునిచ్చారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఆధ్వర్యంలో.. చిత్తూరు నగరపాలక సంస్థ, జీజెఎం చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే తండ్రి గురజాల చెన్నకేశవుల నాయుడు, సోదరుడు గురజాల జీవన్ తో కలిసి ప్రజలకు మట్టితో చేసిన వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. పర్యా వరణ పరిరక్షణ, జల కాలుష్యాన్ని నివారించడం కోసం ప్రజలు మట్టి వినాయక విగ్రహాలని పూజించాలని కోరారు. 2000 మట్టి విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, సీఎంఎం గోపి, ఏఈలు లోకేష్, రజని, నగర పాలక సంస్థ అధికారులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## కాణిపాకం దేవస్థానం ఈవోను కలిసిన జనసేన నాయకులు



**ఐరాల - సూర్యవాస్తవం :** చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం ఐరాల మండలం కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన ఈవో డిప్యూటీ కమిషనర్ పట్టెం గురు ప్రసాద్ ను శుక్రవారం జిల్లా జనసేన నాయకులు ఎం మహేష్ స్వేరో, ఐరాల మండల కార్యదర్శి చైతన్యకుమార్, శ్రీకాంత్, పిఎస్పీకే తేజ, భరత్, చంద్ర, మిథున్ సాయి తదితరులు కలసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. జనసేన నాయకులు ఎం.మహేష్ స్వేరో మాట్లాడుతూ సుదీర్ఘ అనుభవం ఉన్న పట్టెం గురు ప్రసాద్ కాణిపాక ఈవోగా రావడం మంచి పరిణామ మని ఆయన ఆధ్వర్యంలో కాణిపాక దేవాలయం బ్రహ్మోత్సవాలు బ్రహ్మాండంగా జరగాలని, కాణిపాక దేవస్థానం మరింత రెట్టింపు స్థాయిలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ ఉన్నారని తెలిపారు. దేవస్థాన సిబ్బందికి, దేవస్థాన అభివృద్ధికి జనసేన పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. కాణిపాకం దేవస్థానానికి ఈవోగా గురు ప్రసాద్ రావడం పట్ల జనసేన నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



## మట్టివినాయకుడితో పర్యావరణాన్ని కాపాడుదాం

- డిస్కవర్ అనిల్ - శారద మున్సిపల్ హై స్కూల్ విద్యార్థులతో మట్టి గణపతి వర్క్ షాప్

**అనంతపురం క్రైం - సూర్యవాస్తవం :** వినాయక చవితి ఉత్సవాలకు యావత్తు సిద్ధమవుతున్నది. పండుగలు, సంప్రదాయాల పరిరక్షణతోపాటు సామాజిక బాధ్యతను కూడా తీసుకోవాల్సిన తరుణమిది. కాలుష్యానికి కారణమయ్యే, ప్రజలకు ఇబ్బందులు కలిగించే పద్ధతులను పక్కనపెట్టి పర్యావరణహిత గణపతులకు ప్రాధాన్య మిద్దా మంటున్నారు. డిస్కవర్ అనంతపురం అనిల్. ఆయన సామాజిక బాధ్యత గా భావించి భావితరాలను రక్షించడం కోసం అనేక కార్యక్రమాలను అయన చేపడుతున్నారు. ఈ క్రమంలో మట్టి విగ్రహమే మహా విగ్రహం అంటూ సామాజికవేత్త డిస్కవర్ అనిల్ శారద మున్సిపల్ బాలికల హైస్కూల్‌లో వర్క్ షాప్‌ను నిర్వహించారు. స్కూల్‌లో విద్యా ర్థులంతా ఈ వర్క్ షాప్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు.అందులో భాగంగా చిన్నారులకు మట్టి వినా యక విగ్రహాల వినియోగంపై అవగాహన కల్పిస్తూ తయారీలో చిన్నారులకు శిక్షణ ఇచ్చి చిన్నారి విద్యార్థులు చేత స్వయంగా తమ చిట్టి చేతులతో బొజ్జగణ పయ్య లను తయారు చేశారు. ఈ కార్యక్రమంలో డిస్కవర్ అనిల్ మాట్లాడుతూ..... పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు బదులుగా మట్టి వినాయకులనే వాడాలని ప్రకృతి ప్రేమికులు పర్యావరణ పరిరక్షకులు డిస్కవరీ అనంతపురం అనిల్ కోరుతున్నారు. రంగుల రంగుల వినాయకుడు అంటూ రసాయన విగ్రహాలు కాలుష్య కారకులుగా మారుతున్నాయనీ నీరు,గాలి వాతావరణం కాలుష్యం కాకుండా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు బదులుగా మట్టి వినాయకులనే వాడాలని కోరారు.

## విఘ్నాలు తొలగి.. విజయాలు చేకూరాలి

- శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ రత్న ఆకాంక్ష



**అనంతపురం-సూర్యవాస్తవం:** శ్రీ సత్యసాయి జిల్లా ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు జిల్లా ఎస్పీ వి.రత్న.జిల్లా ప్రజలందరికీ విఘ్నాలు తొలిగి విజయాలు చేకూరాలని ఆమె ఆకాంక్షించారు. శనివారం జరిగే వినాయక చవితి ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని, అందరి జీవితాల్లో విఘ్నాలు తొలగిపోయి విజయాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో జిల్లాలోని ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో... అభివృద్ధిలో ముందడుగు వేయా లని అభిలషించారు. వినాయక చవితి వేడుకలు, గణేష్ నిమజ్జనం కార్యక్రమాలు ప్రశాంతంగా, ఆనందంగా నిర్వహించుకోవాలని, పర్యావరణాన్ని కాపాడేందుకు మట్టితో తయారుచేసిన గణపతిని ప్రతి ఒక్కరు పూజించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## మట్టి వినాయకుల పంపిణీ



**మదనపల్లె క్రైమ్-సూర్య వాస్తవం:** వినాయక చవితి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఉచితంగా వినాయకుని ప్రతిమలను పట్టణ ప్రజలకు ఎమ్మెల్యే షాజహాన్ భాష శుక్రవారం పంపిణీ చేశారు. పోతపోలు మాజీ సర్పంచ్ ఖాదర్ ఖాన్ ఆధ్వర్యంలో బెంగుళూరు బస్టాండ్, ఎన్టీఆర్ సర్కిల్, నీరు గట్టుపల్లిలోనే టమోటా మార్కెట్ యార్డుల వద్ద వినాయకుని మట్టి విగ్రహాలు పంపిణి కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే షాజహాన్ బాషా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. మట్టితో తయారు చేసిన విగ్రహాలను వాడి పర్యావరణాన్ని పరిరక్షించాలి అన్నారు. ప్రతి ఒక్కరికి మట్టి గణపతి ప్రతిమ, పూల మొక్క, టెంకాయను దాతలు అందివ్వడం అభినందనీయమని తెలిపారు. పంపిణి చేశారు. ముక్యంగా ప్రజలందరికి చవితి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.తాజ్ హోటల్ అధినేత మాజీ సర్పంచ్ పఠాన్ ఖాదర్ ఖాన్ ఆధ్వర్యంలో వినాయకుని ప్రతిమల పంపిణీ చేయడం పట్ల అభినందనలు తెలిపారు.ప్రజలందరు చవితి పండుగను సంతోషంగా జరుపుకోవాలని కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఎక్కడ చూసిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలే

**తిరుపతి-సూర్య వాస్తవం:** వినాయక చవితి అనగానే వాడవాడలో సందడి నెలకొని ఉంటుంది. పండుగ ప్రారంభం నుంచి నిమజ్జనం చేసే వరకు చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా ఆడుతూ పాడుతూ కులమతాలకు అతీతంగా వేడుకలు నిర్వహిస్తారు. అలాంటి వినాయక చవితి వేడుకలకు రెండు తెలుగు రాష్ట్రాలు సిద్ధమవుతున్నాయి.వినాయక చవితి అంటే పర్యావరణహితంగా నిర్వహించాలని నాయకులు సభల్లో ప్రసంగిస్తారు.. అధికారులు సమావేశాల్లో ఆదేశాలు జారీ చేస్తారు... ప్రకృతి ప్రేమికులు అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. ఇదంతా కేవలం పండుగ వారం.. పది రోజుల నుంచి మాత్రమే గుర్తుకు వస్తుంది. ప్రసాదం రెండు తెలుగు రాష్ట్రాల్లో వినాయక చవితి వేడుకల్లో అత్యధికంగా ప్లాస్టర్ ఆఫ ప్యారిస్ విగ్రహాలు విక్రయాలు జరిగినట్లు తెలుస్తోంది. ఇక మట్టి బొమ్మలు... నీటిలో సులభంగా కరిగిపోయే విగ్రహాలు మాత్రం తయారీ తక్కువ.. విక్రయాలు తక్కువగా ఉన్నాయని తయారీ, వ్యాపారస్తులు అంటున్నారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని గ్రామాల నుంచి పట్టణాల వరకు ప్రతి వీధిలో వినాయక విగ్రహాలు కొలవుతీర్చి పూజలు చేస్తారు. ప్రతి చోట ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు దర్శనమిస్తున్నాయి. పండుగకు మూడు నెలల ముందు నుంచే విగ్రహాలు తయారీ వాటికి రంగులు వేయడం చేస్తుంటారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను ఎక్కువ మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, బీహార్ నుంచి వచ్చిన వారే తయారీ చేసి విక్రయాలు చేస్తున్నారు. ఇక మట్టి, నీటిలో కరిగిపోయే విగ్రహాలు గురించి చాలా వరకు తయారీ చేసే ప్రాంతాలు తెలియకపోవడం దానికి తోడు తయారీ చేసే వారు కరువై పోవడంతో మట్టి బొమ్మలు లేవని చెప్పొచ్చు.ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వల్ల పర్యావరణ కాలుష్యము ఎక్కువగా నెలకొంటుంది. విగ్రహాల తయారీలో వినియోగించే రసాయనాలు వల్ల విగ్రహాలను నీటిలో వేయడం వల్ల రంగులు రసాయానాల కారణంగా నీటిలోని జలరాసులకు ప్రమాదం ఉంది. నీటిలో కరిగే కొంచెం పాటి రసాయనాల వల్ల ఆ నీటిని తాగే జనజీవరాశులు ప్రమాద భారీన పడతాయి. వాటి వల్ల అనారోగ్య సమస్య వస్తాయి. ఇక నీటిని పంటలకు ఉపయోగిస్తే ఆ పంటలు వృద్ధి చెందకపోవడం, ఆ నీటి ద్వారా వచ్చే ఆహారం తినడం వల్ల అనారోగ్య లక్షణాలు గురికాక తప్పదు. ముఖ్యంగా ఎంతో పవిత్రంగా భావించే వినాయక స్వామి వారిని పూజలు చేసి నీటిలో కలుపుతాము. మట్టిలో కరిగిపోయే విగ్రహాలు వల్ల దేవుడు కూడా శాంతిస్తాడని... ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు నీటిలో కరగకుండా రోజుల తరబడి విగ్రహాలు ఉండడం వల్ల చేసిన పూజా కూడా ఫలించిందని అర్చకులు చెబుతున్నారు.కర్నాటక రాష్ట్రం, తమిళనాడు రాష్ట్రంలో అక్కడి ప్రభుత్వాలు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను పూర్తిగా నిషేధించాయి. పర్యావరణంతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలిగించే విగ్రహానలను వాడకూడదని ప్రచారం చేయడంతోపాటు వాటి తయారీదారులకు హెచ్చరికలు జారీ చేశారు. ఇలా నిబంధనలు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఆయా రాష్ట్రాల్లోని చాల ప్రాంతాల్లో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు నిషేధించారు. తిరుపతి సమీపంలోని బొమ్మల క్వార్టర్స్ లో తయారు చేసే సుమారు 3 లక్షల విగ్రహాలు తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు ఎక్కువగా విక్రయాలు జరిగాయి. అయితే కూటమి ప్రభుత్వం అయిన పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను నిషేధించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. ఈ ఏడాది సమయం ముగిసిపోయింది.. వచ్చే ఏడాది ముందే ఇతర రాష్ట్రాల లాగా మనం రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల తయారీదారులకు ముందస్తుగా చెప్పి. మట్టి, నీటిలో కరిగిపోయే విగ్రహాలను తయారు చేయాలని నిమజ్జన కమిటీ సభ్యులు, పర్యావరణ ప్రేమికులు విన్నవిస్తున్నారు.

### వరద బాధితులకు అండగా..

# స్వయం సహాయక సంఘాలు

❖ అర్బన్ నియోజకవర్గం నుంచి 3 లక్షల 5వేల రూపాయల సాయం ❖ అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటికి చెక్ అందజేసిన స్వయం సహాయక సంఘాలు
❖ మహిళా సంఘాల ప్రతినిధులను అభినందించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ❖ బాధితులను ఆదుకునేందుకు మరింత మంది ముందుకు రావాలని పిలుపు



**అనంతపురం (సూర్య వాస్తవం):** విజయవాడలో వరద బాధితులను ఆదుకునేందుకు అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలు ముందుకొచ్చారు. నియోజకవర్గంలో మొత్తం 320 స్వయం సహాయక సంఘాల గ్రూపులు ఉండగా 30500 మంది సభ్యులు ఒక్కో మహిళ 10 రూపాయలు చొప్పున మొత్తం మూడు లక్షల 5 వేల రూపాయలు సేకరించారు. ఈ మొత్తానికి సంబంధించిన మెగా అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కు మాజీ మేయర్ స్వరూప ఆధ్వర్యంలో అందజేశారు. అర్బన్ నియోజకవర్గ కార్యాలయంలో చెక్ అందజేసి వరద బాధితులకు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ అనంతపురం జిల్లా తెలుగుమహిళ అధ్యక్షురాలు, మాజీ మేయర్ స్వరూపతోపాటు స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వరూప మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ ఏ విపత్తు వచ్చినా అనంతపురం జిల్లా ప్రజలు ఆదుకునేందుకు ముందుకు వస్తారన్నారు. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలు మొదటి అడుగు వేయడం సంతోషంగా ఉందన్నారు. రేపటి నుంచి తెలుగు మహిళా విభాగం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విరాళాలు సేకరించి వరద బాధితులకు అందేలా చూస్తామని ఆమె అన్నారు. మరోవైపు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకునేందుకు స్వయం సహాయక సంఘాల మహిళలు ముందుకు రావడం సంతోషకరంగా ఉందన్నారు. చిరువ్యాపారాలు, చిన్న చిన్న పనులు చేసుకునే మహిళలే ఈ విధంగా సాయం చేసేందుకు ముందుకు వచ్చినప్పుడు మిగిలిన వారు కూడా స్పందిస్తే వరద బాధితులను కచ్చితంగా ఈ విపత్తు నుంచి ఆదుకోగలమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ ఈ విషయంపై మానవతా దృక్పథంతో ఆలోచించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి కోరారు.

## జిల్లా ప్రజలందరికీ వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు

### - జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్



**తిరుపతి-సూర్య వాస్తవం:** వినాయక చవితి సందర్భంగా జిల్లాలోని ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో పర్యావరణ హితంగా ఉత్సవాలు జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్ నేడు ఒక ప్రకటనలో వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వినాయక చవితి ఎంతో పవిత్రమైన పండుగ అని, అన్ని విఘ్నాలను, సంకటాలను హరించి విజయాన్ని అందించే వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రజలందరి ఇంటా విఘ్నాలు తొలగి వారు ఆయు ఆరోగ్యాలతో, సుఖ సంతోషాలతో, సౌభాగ్యాలతో సిరి సంపదలతో తుల తూగాలని, మట్టి వినాయకులని ఉపయోగించాలని కలెక్టర్ తెలిపారు.




PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG CELL : 918500425222 (FOUNDER -N.ARIF ALI )